Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03






# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



# జనం మెచ్చేలా జగన్!

- గరగపర్రు వివాద పరిష్కారంలో పరిణితి చెందిన నేతగా గుర్తింపు పొందిన ప్రతిపక్ష సారధి
- సమస్యను పరిష్కరించిన విధానంపై సర్వత్రా ప్రశంసలు

"నాకు ఓట్లేయకుంటే నేనేసిన రోడ్ల మీద నడవొద్దు... నేనిచ్చే పింఛన్‌లు, రేషన్ తీసుకుంటూ నాకు ఓట్లేయరా... హైటెక్ సిటి నేనే కట్టించాను... హైదరాబాద్‌ను నేనే డెవలప్ చేసాను... కంప్యూటర్ కనిపెట్టింది నేనే... సత్య నాదెళ్లను మైక్రోసాఫ్ట్ సిఇఓను చేసింది నేనే" అని చెప్పుకునే నాయకుడికి...

"ఊరన్నాక అందరూ కలిసిమెలసి ఉండాలి, ఒకరి కష్టాల్లో ఒకరు తోడుండాలి, మీరు లేకుండా వాళ్ళు లేరు, వాళ్ళు లేకుండా మీరు లేరు... ఒకొరికొకరు సహకరించుకుని ముందుకు సాగితేనే మనిషి జీవితం" అని చెప్పిన నాయకుడికి ఎంత తేడా?

మొదటి నాయకుడిది నలభై ఏళ్ల రాజకీయ అనుభవమైతే, రెండో నాయకుడి వయసు నాలుగు పదులు దాటిందంతే! నాయకుడు హుందాగా ఆలోచించడానికి, మంచి జరగాలని కోరుకోవడానికి అనుభవంతో... వయసుతో పని లేదు, మనసుంటే చాలని నిరూపించాడు ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి.

1978లో అంజయ్య కేబినెట్‌లో చంద్రబాబు మంత్రయ్యే నాటికి జగన్‌ది చెడ్డీలు తొడుక్కునే వయసు. చంద్రబాబు రాజకీయ అనుభవంతో పోలిస్తే జగన్ వటవృక్షం ముందు వేరుముక్క లాంటోడు. అయినా ఆయన అనుభవం సమస్యలు సృష్టిస్తుంటే, చాలా అనుభవం తక్కువ వున్న జగన్ ఎంతో సమయస్ఫూర్తితో సమస్యలను చల్లారుస్తున్నాడు. పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం గరగపర్రు గ్రామంలో దళితులు, అగ్రవర్ణాల మధ్య రావణకాష్టంలా రేగిన కుల దావాగ్నిని

(మిగతా 11వ పేజీలో)



# అడ్డం తిరిగిన సదావర్తి

- అయోమయంలో 'దేశం' చక్రవర్తి
- ఆర్.కె. షాక్‌కు మైండ్ బ్లాక్

**'సదావర్తి'... ఈ పేరును రాష్ట్ర ప్రజలకు కొత్తగా పరిచయం చేయాల్సిన పని లేదు. ఇప్పటికే జనం నోళ్ళలో నానుతోంది. మన రాజకీయ పక్షాలు అలా నానేలా చేసాయి కూడా. చెన్నైకి సమీపంలో 83.11 ఎకరాల సదావర్తి సత్రం భూముల వేలంకు సంబంధించి కీలకమలుపు చోటు చేసుకుంది. సదావర్తి సత్రం భూములపై ఉమ్మడి హైకోర్టు తెలుగుదేశం నాయకులకు దిమ్మతిరిగే షాకిచ్చింది.**

సదావర్తి భూములను వేలం పాటల్లో దక్కించుకున్న మొత్తానికి ఎవరైనా అదనంగా 5కోట్లు చెల్లిస్తే వారికే సదావర్తి భూములను కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం అప్పట్లో సవాల్ చేసింది. ఆ సవాల్‌కు మంగళగిరి వైసిపి ఎమ్మెల్యే

(మిగతా 11వ పేజీలో)



## సమర్ధతకు... గుర్తింపేది?

12లో

# ఓట్లకు నోట్ల వర్షమే?

## గుబులు పుట్టిస్తున్న నంద్యాల



**ఇంకా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడలేదు. నామినేషన్ల తేదీ, పోలింగ్ తేదీలు తెలియదు. కౌంటింగ్ తారీఖు చెప్పలేదు. కాని రేపే ఎలక్షన్ అన్నంతగా నంద్యాలలో టెన్షన్ నెలకొంది. నంద్యాల ఉపఎన్నిక ఆషామాషీగా జరిగేటట్లు లేదు. ఓ పక్క అధికార తెలుగుదేశం పార్టీ ఎలాగైనా గెలిచి తీరాలన్నట్లు పంతం పట్టింది. మరోపక్క నంద్యాలను గెలిచి రేపటి జైత్రయాత్రను ఇక్కడనుండే ఆరంభించాలని వైకాపా పట్టుదలగా వుంది.**

ఇక్కడ ఇరుపార్టీలకు అభ్యర్థులు కూడా సిద్ధమయ్యారు. తెలుగుదేశంకు భూమా బ్రహ్మానందరెడ్డి, వైకాపాకు శిల్పా మోహన్‌రెడ్డి. కాంగ్రెస్‌తో పాటు ఇంకొన్ని పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కూడా బరిలో దిగొచ్చు. ప్రధాన పోటీ మాత్రం వైకాపా, టీడీపీల మధ్యే! ఇక నంద్యాల ఉపఎన్నికలలో ప్రధాన ప్రభావం చూపబోయేది డబ్బేనని తెలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఓటుకు 5వేలు ఇవ్వగల కెపాసిటీ నాకుంది, అయినా ఇవ్వను అంటూ ఓటు విలువను పరోక్షంగానే 5వేలకు తీసుకెళ్లాడు. చంద్రబాబు మాటలను బట్టి నంద్యాల ఓటర్లపై డబ్బు కుమ్మరించబోతున్నారని అర్ధమవుతోంది. ఈమధ్యే కడప, కర్నూలు, నెల్లూరుజిల్లాల స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార తెలుగుదేశం ప్రలోభాలను చూసాం. ఓటర్లను సంతలో పశువుల మాదిరిగా కొనుగోలు చేసారు. ఎమ్మెల్సీ ఎన్నికలకే అన్ని కోట్లు

(మిగతా 11వ పేజీలో)



## నోర్లు తెరిచిన బోర్లు..

# మృత్యువుకు రహదార్లు

### • అప్రమత్తంగా లేకుంటే ప్రాణాలకు ప్రమాదమే



**బోర్లు నోర్లు తెరిచాయంటే.. అవి మృత్యువుకు రహదార్లనే తెలుసుకోవాలి. నిర్లక్ష్యంగా బోర్లను తవ్వి వదిలేస్తే అవే మనపాలిట మృత్యుకూపాలవుతాయి. నీళ్ళ కోసం బోర్లు తవ్వుకుంటే, అటు నీళ్ళు రాకపోగా..ఆ బోర్ల గుంతలు చావుగుంతలుగా మారుతుంటాయి. అందుకే, బోర్లు తవ్వుకునేవారు ఎంతో అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే ప్రాణాలకే ప్రమాదకరమని ప్రభుత్వం పదేపదే హెచ్చరిస్తోంది.**

ఇటీవల తెలంగాణాలో ఒక చిన్నారి ఆడుకుంటూ పొరపాటున బోరుగుంతలో పడి ప్రాణాలు కోల్పోయిన దురదృష్టకర సంఘటన నేపథ్యంలో, నిరుపయోగంగా వదిలేసే బోరుగుంతల పట్ల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. జిల్లాలోనూ, ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో అనేక చోట్ల సాగునీటి కోసం పొలాల్లో బోర్లు తవ్వుకోవడం సాధారణ విషయమే. అయితే, భూగర్భజలాల నీటిమట్టం బాగా పడిపోవడంతో, ఎంత లోతుకు తవ్వినా బోరుకు నీరందకపోవడంతో ఇక చేసేది లేక ఆయా రైతులు ఆ బోర్లగుంతలను అలాగే వదిలేసి వెళ్తుంటారు. చివరికి అవే నరకానికి దారితీస్తుంటాయి. పొరపాటునో గ్రహపాటునో చిన్నపిల్లలెవరైనా కాలుజారి ఆ గుంతలోపడితే.. ప్రాణాల మీద ఆశలు వదులుకోవాల్సిందే. వందల అడుగుల లోతుకు తవ్విన ఆ బోర్లలో పడితే ఎంత ప్రమాదమో ఆ తర్వాత తెలుసుకుని ఎంతగా బోరుమని విలపించినా పోయిన ప్రాణం తిరిగి రాదు. కనుక, బోర్లు తవ్వేవారు ఎవరైనా సరే, బోర్లను నిర్లక్ష్యంగా వదిలిపెట్టకుండా, వాటిలో ఎవరూ పడకుండా పూర్తిగా కట్టుదిట్టం చేయాల్సి ఉంది. వరికుంటపాడు తదితర మెట్ట ప్రాంత మండలాల్లో సుమారు 3 వందల అడుగుల దాకా తవ్వినా నీళ్ళు రాకపోవడంతో, పలుచోట్ల ఆ బోర్లగుంతలను పూడ్చకుండా అలాగే వదిలేసినట్లు గ్రామాల్లో వినవస్తోంది. బోర్ల గుంతలపై బండరాళ్ళు పెట్టడమో, గోనెపట్టలు కప్పడమో చేసినా.. అవేమిటో తెలియక పిల్లలు వాటిని తీసేయడం కూడా జరుగుతుంటుంది. వందలాది అడుగుల లోతు తవ్వేసి వదిలేసిన ఆ గుంతలో ఎవరైనా చిన్నపిల్లలు పొరపాటున పడిపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పొలాల్లో పనిచేసుకుంటున్న కూలీల పిల్లలు ఈ ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువ. కనుక, జిల్లాలో ఎక్కడా ఇలాంటి ప్రమాదాలు జరగకుండా జిల్లా ఉన్నతాధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. బోర్లు తవ్వించుకునే రైతులకు అవగాహన కలిగేవిధంగా చెప్పడమో, లేదా బోర్లు తవ్వేవారిని హెచ్చరించడమో చేస్తే తప్ప ఈ సమస్య ఒక పట్టాన కొలిక్కి రాదు. ఎక్కడైనా బోర్ల గుంతలు నిర్లక్ష్యంగా వదిలేసినట్లు కనిపిస్తే ప్రజలు కూడా వెంటనే ఆ సమాచారాన్ని అధికారులకు తెలియజేసేలా తుఫాన్ సెల్‌లాగా శాశ్వత ప్రాతిపదికన బోర్ల సమాచారంపై ఒక సెల్ కూడా ఏర్పాటు చేయడం మంచిది. గ్రామస్థాయి సిబ్బంది నుంచి లేదా గ్రామస్తుల నుంచి సమాచారం వచ్చిన వెంటనే ఆ బోరును అధికారులు సందర్శించి దాని నుంచి ఎవరికీ ఎలాంటి ప్రమాదం లేకుండా చూడాలి. నిర్లక్ష్యాన్ని.. అలాగే వదిలేస్తే అది చివరికి పసిబిడ్డల ప్రాణాలనే పొట్టనబెట్టుకుంటుంది కనుక, ఇకనైనా తక్షణం బోర్ల గుంతలను పూడ్చివేసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నివారించాలని ప్రజలు కోరుతున్నారు. ఎవరు ఎక్కడ బోర్లు తవ్వాలన్నా ముందుగా అధికారుల అనుమతి తీసుకుని, వాటి వల్ల ఎలాంటి ప్రమాదం జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, తవ్విన బోర్లను సంబంధిత అధికారులు లేదా సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రమాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడెక్కడ బోర్లు తవ్వుతున్నారో, వాటి పరిస్థితి ఏమిటో ఉన్నతాధికారులు వెంటనే నివేదిక తెప్పించుకుని అవసరమైన ముందుజాగ్రత్తలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. జరగరాని ఘోరం జరిగిపోయాక బోరుమనేకంటే, ముందుగానే అప్రమత్తంగా ఉండడం ఎల్లవేళలా శ్రేయోదాయకం. ఏదేమైనా, బోర్ల తవ్వకం వల్ల ఎక్కడా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలి. అంతే కాదు, ప్రమాదకరమైన నీటిగుంతలను కూడా గుర్తించి, వాటి వద్ద కూడా ప్రమాదాలు జరగకుండా ప్రమాదసూచికలు, బోర్డులు ఏర్పాటు చేయాలి. గ్రామస్థాయి అధికారులు సిబ్బంది పర్యవేక్షణలో బోర్ల వద్ద, నీటిగుంతల వద్ద అప్రమత్తంగా ఉండేలా ఏర్పాట్లు చేసి, ప్రమాదాల నివారణకు ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు శాశ్వతప్రాతిపదికపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# విఎస్‌యు అక్రమార్కులను కాపాడుతున్న మంత్రి

### - విద్యార్థి సమాఖ్య విద్యార్థుల విమర్శ



విక్రమసింహపురి యూనివర్శిటీ అవినీతి, అక్రమాలపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపిస్తానని మాటిచ్చి, ఒక డమ్మీ విచారణ బృందాన్ని నెల్లూరుకు పంపి, కనీస దర్యాప్తు కూడా చేయకుండా రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు విఎస్‌యు అక్రమార్కులను కాపాడుతున్నారని విఎస్‌యు విద్యార్థి సమాఖ్య విద్యార్థులు తీవ్రంగా విమర్శించారు. అంతేకాదు, మంత్రి గంటా శ్రీనివాసరావును మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈనెల3న నెల్లూరు విజయమహల్ గేటు వద్దవున్న విఎస్‌యు విద్యార్థి సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, విఎస్‌యు పట్ల మంత్రి అనుసరిస్తున్న తీరును నిరసించారు. ఎన్నో సంవత్సరాలుగా యూనివర్శిటీలో పేరుకుపోయిన అవినీతి అక్రమాలపై ఎన్ని పోరాటాలు చేసినా, ఎంతమంది ప్రజాప్రతినిధులను కలసినా ప్రయోజనం లేకపోవడంతో, ఎంత కష్టమైనా భరించి, పాదయాత్ర చేసి జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్‌ను కలసి ఈ సమస్యలను విన్నవించామన్నారు. దీంతో స్పందించి నెల్లూరుకు వచ్చిన మంత్రి గంటా శ్రీనివాసరావు ఈ యూనివర్శిటీలో జరిగిన బోధన, బోధనేతర విభాగాల్లో జరిగిన అక్రమాలు, పరీక్ష విభాగపు అక్రమాలు, భవన నిర్మాణ అక్రమాలు, విద్యార్థులపై కక్షపూరిత చర్యలు ఇలా అనేక సమస్యలపై ప్రభుత్వం అత్యున్నత కమిటీని ఏర్పాటుచేసి అక్రమాలపై తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. అయితే, కేవలం భవన నిర్మాణాల పరిశీలన అంటూ భవన నిర్మాణ కమిటీలో సభ్యుడినే కమిటీ సభ్యునిగా కూడా వేసి, ఎలాంటి దర్యాప్తు లేని ఒక డమ్మీ కమిటీని నియమించారని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్శిటీ అక్రమాలను మంత్రి పూర్తిస్థాయిలో కాపాడుతున్నారని వారు ఆరోపించారు. దీంతో యూనివర్శిటీలో ప్రస్తుత పాలకుల అక్రమాలకు ఆగడాలకు అంతేలేకుండా పోతోందని, రాజ్యాంగవిరుద్ధమైన పాలన యూనివర్శిటీలో సాగుతోందని, వర్శిటీ ప్రతిష్టను వి.సి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌లు దిగజార్చివేస్తున్నారని వారు ఆరోపించారు. దీంతో, విద్యార్థులెవరూ ఈ యూనివర్శిటీలో చేరేందుకు ముందుకు రావడం లేదని, అందుకు ప్రస్తుతం జరిగిన పీజీ అడ్మిషన్లే నిదర్శనమన్నారు. విఎస్‌యు ప్రక్షాళన జరిగేదాకా తమ పోరాటం ఆపేది లేదని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ సుధీర్, గంగిరెడ్డి, మల్లి శ్రీకాంత్‌యాదవ్, ఆవులయ్య, రాజేష్, శ్రీను, రమణ పాల్గొన్నారు.

## కోవూరు సి.ఐ హఠాన్మరణం



కోవూరు సి.ఐ మాధవరావు(53) ఈనెల 2వతేదీ అర్ధరాత్రి గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆరోజు రాత్రి విధులు ముగించుకుని ఇంటికి బయల్దేరగా మధ్యలోనే గుండెపోటు వచ్చింది. వెంటనే ఆయనను నెల్లూరులోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో మరణించారు. ప్రకాశం జిల్లా చిన్నవెంకన్నపాలెంకు చెందిన ఆయన 1996లో పోలీస్‌శాఖలో చేరారు. జిల్లాలో ఇందుకూరుపేట, ఉదయగిరి, కొడవలూరు, బుచ్చి, తడ, అల్లూరు స్టేషన్‌లలో ఎస్ఐగా పని చేశారు. సిఐగా పదోన్నతి వచ్చాక కోవూరు సిఐగా నియమితులయ్యారు. పోలీసుశాఖలో మంచివ్యక్తిగా వివాదరహితుడిగా పేరుంది. ఆయన మృతి పట్ల జిల్లా పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి చెందారు.

## షార్ క్రెడిట్ సొసైటీకి పోటాపోటీ

శ్రీహరికోటలోని షార్ ప్రాజెక్ట్ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలు పోటాపోటీగా జరుగనున్నాయి. ఈ ఎన్నికల బరిలో 15 మంది పోటీకి తలపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. బుధవారం నామపత్రాల ఉపసంహరణ జరిగినా ఎవరూ ఉపసంహరించుకోకపోవడంతో ఆరుగురు డైరెక్టర్ల స్థానాలకు 15 మంది పోటీలో ఉన్నట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ పోటీలో పి.శివకుమార్, టి.రవి, బి.జగన్‌బాబు, ఎం.రవీంద్రనాథ్, ఎ.అరుణ్‌కుమార్, డబ్ల్యు శ్రీధర్, పి.కృష్ణయ్య, ఎన్.రమేష్, ఆర్.రాము, జి.సుజిత్‌కుమార్, కె.రవికుమార్, యు.కృష్ణ, ఎన్.కుమారస్వామి, పి.విశ్వనాథశర్మ, పిఎస్ జెట్టి ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 10వ తేది ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల దాకా పోలింగ్ ఉంటుంది. ఆ తర్వాత ఓట్ల లెక్కింపు. సాయంత్రానికల్లా ఫలితాలు ప్రకటిస్తారు. డైరెక్టర్లుగా ఎన్నికైన వారు తమలో ఇద్దరిని అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈ ఎన్నికల్లో మొత్తం 1820 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

## రోశయ్య పుట్టినరోజు సంబరాలు

ఏపి మాజీముఖ్యమంత్రి, తమిళనాడు మాజీగవర్నర్ కొణిజేటి రోశయ్య 85వ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం ఆయన శ్రేయోభిలాషి, ఆప్తమిత్రుడు, శ్రీ పొట్టి శ్రీరాములు అవార్డు గ్రహీత కె.వి.చలమయ్య దేవాలయాల్లో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. రోశయ్య పేరు మీద జొన్నవాడ కామాక్షమ్మ మల్లిఖార్జున స్వామి దేవస్థానంలో, సూళ్లూరుపేట చెంగాళమ్మ అమ్మవారి దేవస్థానంలో, నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో, సిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో పూజలు చేయించి వేద పండితులు కొణిజేటి రోశయ్యకు ఆశీర్వచనాలు అందజేశారు.

## "రెడ్" ఫలసరుకుల పంపిణీ



గూడూరు త్యాగరాజవీధి వీరభద్రస్వామి దేవస్థానం నందు 'రెడ్' సంస్థ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మి పిఎంరావు దాతృత్వంతో 25మంది పేదలకు ఫలసరుకులు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, ఇన్నర్‌వీల్ సభ్యులు డాక్టర్ సుగుణమ్మ, జీవని, విష్ణువందన, వై.లక్ష్మి, రమ, ప్రభ, సౌందర్యమ్మ, జమునమ్మ, డాక్టర్ లక్ష్మి, రెడ్‌సంస్థ ప్రతినిధులు జానా సుధీర్, రామలింగం, రాజేష్, చిన్న, వెంకటేశ్వర్లు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# గురువు దేవుడితో సమానం

## - నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



గురువు దేవుడితో సమానం. తాను ఈరోజు ఈ స్థితిలో ఉండడానికి కారణం తన గురువు రత్నం విద్యాసంస్థల ఛైర్మెన్ కె.వి.రత్నం అని చెప్పు నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కె.వి.రత్నం, పద్మావతి రత్నంలకు పాదాభివందనం చేశారు. నెల్లూరు హరనాథపురం రెండవ వీధిలోని కె.వి.రత్నం గృహానికి మంగళవారం కోటంరెడ్డి వెళ్లారు. రత్నం దంపతుల ఆశీర్వాదం తీసుకుని వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ తన చిన్నతనంలో కె.వి.రత్నం అంటే ఎంతో అభిమానమని, ఆయన వద్ద చదవకపోయినా ఆయనను గురువుగా భావిస్తూనే విద్యాభ్యాసం సాగిందన్నారు. తన స్నేహితులు కొందరు రత్నం వద్ద చదువుకున్నారని, వారు నిత్యం పాఠ్యాంశాలలోని పాఠాలతో పాటు సమాజం, విలువలు, మానవత్వం, సేవాగుణం, చరిత్ర గురించి ప్రత్యేకంగా బోధించేవారన్నారు. వారు చెప్పిన మాటలకు ఆకర్షితుడినై ఆయనకు శిష్యుడిగా మారానన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఆయన శిష్యుడిగా ఉండడమే తనకు ఆనందమన్నారు. కె.వి.రత్నం మాట్లాడుతూ కోటంరెడ్డి నుడా ఛైర్మెన్‌గా ఎన్నిక కావడం ఆనందంగా ఉందన్నారు. చిన్నతనంనుంచి రాజకీయంగా, సేవా కార్యక్రమాల్లో ముందంజలో వుండేవాడని, నాయకత్వ లక్షణాలు మెండుగా ఉన్న వ్యక్తని కొనియాడారు.

# విద్యే కాదు... విలువలూ ముఖ్యమే

- బిజిఆర్ కాలేజీలో ప్రథమ సంవత్సర వేడుకలు



నెల్లూరులోని డా॥ బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ప్రథమ సంవత్సర ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ జె.వి.రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల సేవా దృక్పథంతో పని చేస్తుందని కేవలం మార్కులే కాకుండా విద్యార్థినులకు మానవతా విలువలు, సాంస్కృతిక సాహిత్య రంగాల పట్ల అవగాహన కల్పిస్తుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ మృదుల మాట్లాడుతూ తమ కళాశాలలో అనుభవజ్ఞులైన అంకిత భావం కలిగిన అధ్యాపకులు పనిచేస్తున్నారన్నారు.

పూర్వపు ప్రిన్సిపల్ సన్నపురెడ్డి రాఘవరెడ్డి, రొటేరియన్ సనత్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పందులపై సీరియస్

- 25 తర్వాత కనిపిస్తే కాల్చివేతే!
- నగరంలో మరిన్ని మార్పులకు శ్రీకారం



నెల్లూరు నగర వీధుల్లో మందలు మందలుగా తిరుగుతున్న పందులపై సీరియస్ యాక్షన్‌కు నగర పాలక సంస్థ కమిషనర్ ఢిల్లీరావు సిద్ధమవుతున్నారు. ఈ నెల 25వ తేదీ దాకా పందుల యజమానులకు గడువిచ్చారు. 25వ తేదీ తర్వాత నగరంలో కనిపించే పందులను పోలీసుల సాయంతో కాల్చించి వేస్తామని కమిషనర్ గట్టిగా హెచ్చరించారు. అలాగే కుక్కలను కూడా ఏరివేస్తామని కమిషనర్ ఢిల్లీరావు 5వ తేదీ నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చెప్పారు. నెల్లూరు ప్రధానరోడ్లపై తిరుగుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 80 ఆవులను ఇప్పటికే తిరుపతి గోశాలకు పంపామని, మిగతా ఆవులను కూడా గుర్తించి అక్కడికే పంపిస్తామని చెప్పారు. జిల్లా కలెక్టర్ సహకారంతో పదిమంది సర్వేయర్లతో నగరంలోని ప్రధాన కాలువలన్నింటిని సర్వే చేయబోతున్నట్లు చెప్పారు. అలాగే ఏసిటి సంస్థ, విపిఆర్ ఫౌండేషన్, రత్నం స్కూల్స్ వారి దాతృత్వంతో నగరంలో డివైడర్‌లను గ్రీన్ బెల్టుగా అభివృద్ధి చేయడం, ఫాగింగ్ మిషన్ వంటివి ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు.

# షార్‌లో కారెం శివాజీ




రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల కమిషన్ ఛైర్మెన్ కారెం శివాజీ మరియు కమిషన్ సభ్యులు సోమవారం ఉదయం శ్రీహరికోట షార్ సెంటర్‌లో పర్యటించారు. తొలుత షార్‌లోని షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల ఉద్యోగులతో సమావేశం అనంతరం ముఖ్య కమాండ్ కంట్రోల్ రూమ్, మొదటి రాకెట్ ప్రయోగ వేదిక, 2వ రాకెట్ ప్రయోగ వేదిక, టెలిమెట్రి మరియు మ్యూజియంలను వీక్షించారు. షార్ డిప్యూటి డైరెక్టర్ కె.పాంగినన్ ప్రయోగ వేదికలు మరియు టెలిమెట్రి తదితరాల గురించి కూలంకషంగా వివరించారు. అనంతరం సిబ్బందితో జరిగిన సమీక్షా సమావేశంలో ఉద్యోగ నియామకాలు మరియు పదోన్నతులలో ఎస్సీ, ఎస్టీ రోల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. షార్‌లో రోల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడంలో సంతృప్తిని వ్యక్తపరిచారు. అంతర్జాతీయంగా షార్ సెంటర్‌కు 2వ స్థానం గుర్తింపు పొందడంలో షార్ శాస్త్రవేత్తలను, డైరెక్టర్ల కృషిని అభినందించారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పర్యటించి వారి సాధక బాధకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు నరహరి వరప్రసాద్, సుధారాణి, బి.రవీంద్ర, సోమలతతో పాటు షార్ డైరెక్టర్ కున్హికృష్ణన్, నాయుడుపేట రెవెన్యూ డివిజనల్ అధికారి శీనా నాయక్, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు మధుసూధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# వాత్సల్యకు డా॥ శ్రీనివాసరాజు చేయూత




నేటి యువత అల్లూరు సీతారామరాజు, స్వామి వివేకానందలను స్ఫూర్తిగా తీసుకుని ఆ మార్గంలో నడిచి నిస్వార్థంతో సమాజసేవ కోసం పని చేయాలని నెల్లూరు నగర కార్పొరేషన్ కమిషనర్ ఢిల్లీరావు పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరు కొండాయపాలెంలోని జనహిత - వాత్సల్య నిరాధార బాలబాలికల ఆవరణంలో గల హైస్కూలులో మన్యం వీరుడు అల్లూరు సీతారామరాజు జన్మదినం, స్వామి వివేకానంద పుణ్యతిథి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా జనహిత సంస్థ గౌరవాధ్యక్షులు సామంతు గోపాల్ రెడ్డి వ్యవహరించగా, జనహిత సంఘటనా కార్యదర్శి జి.వి.సాంబశివరావు ప్రారంభించారు. అనంతరం నెల్లూరు కిమ్స్ కార్డియాలజీ చీఫ్ డా॥ సి.ఎస్.శ్రీనివాస రాజు తన జన్మదిన వేడుకలను పిల్లల మధ్య కేక్ కట్ చేసి జరుపుకుని మాట్లాడుతూ మన పనిని అంకితభావంతో చేస్తూ పోతే ఎవ్వరికీ తలవంచాల్సిన అవసరం లేదన్నారు. పిల్లలకు తల్లిదండ్రులకన్నా ఉపాధ్యాయులే అసలైన రోల్‌మోడల్స్ అని, ఉపాధ్యాయులు పిల్లలను చక్కని మార్గంలో నడిపించడానికి పాటుపడాలని కోరారు. ఈ సందర్భంగా రూ.40వేల చెక్కును వాత్సల్య గౌరవాధ్యక్షుడు సామంతు గోపాల్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఎస్ ఆర్టీసీ నెల్లూరు రీజియన్ చీఫ్ మెకానికల్ ఇంజనీరు శ్రీనివాసరావు, మురళీకృష్ణ హోటల్స్ అధినేత గ్రోసు సుబ్బారావు, బీజేపీ నాయకులు కరణం భాస్కర్, ప్రధానోపాధ్యాయుడు ఎం.మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం వాత్సల్య స్కూలు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

# డిఎస్పీల బదిలీ

నెల్లూరు రూరల్ డిఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి బదిలీ అయ్యారు. ఆయనను డిజిపి ఆఫీసులో రిపోర్ట్ చేసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఆయన స్థానంలో సిఐడి డిఎస్పీగా పని చేస్తున్న రాఘవరెడ్డిని నియమించారు. అలాగే కావలి డిఎస్పీగా వున్న రాఘవరావును కూడా బదిలీ చేసి ఆయన స్థానంలో సిఐడి డిఎస్పీగా వున్న రఘును నియమించారు. అయితే త్వరలోనే రాఘవరావు ఉద్యోగ విరమణ చేయనుండడంతో అప్పటివరకు ఆయన కావలిలోనే వుండేలా మళ్లీ నిర్ణయం తీసుకున్నారు. ఆయన పదవీ విరమణ తర్వాత కొత్త డిఎస్పీ జాయిన్ అవుతారు.

# స్పాస్టిక్ సెంటర్‌కు లక్ష విరాళం



నెల్లూరులోని రెడ్‌క్రాస్ మాగుంట సుబ్బరామిరెడ్డి స్పాస్టిక్ సెంటర్‌కు పిఎన్ఆర్ అండ్ సన్స్ వారు 5వ తేదీన లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పినాకిని ఆధ్వర్యంలో నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ చేతుల మీదుగా స్పాస్టిక్ సెంటర్ కన్వీనర్ బి.మనోహర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ అధ్యక్షులు డాక్టర్ ఏ.వి.సుబ్రహ్మణ్యంలకు అందించారు. కార్యక్రమంలో పిఎన్ఆర్ సంస్థ అధినేతలు పి.జనార్ధన్, పి.సీతారాం, లయన్స్‌క్లబ్ ఆఫ్ పినాకిని అధ్యక్షులు ఎం.విక్రమ్, కార్యదర్శి ఎన్.కిరణ్, కోశాధికారి ఆనందకుమార్, క్లబ్ మాజీఅధ్యక్షులు కోట రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రభా'తం

# విషం కక్కుతున్న డ్రాగన్

**ఎప్పుడో సమసిపోయాయనుకున్న సరిహద్దు వివాదాలు మళ్లీ ఉద్రిక్తతలు పెంచుతున్నాయి. ఇవి యుద్ధానికి దారితీస్తాయేమోననే ఉద్రిక్త వాతావరణం అంతటా పెరుగుతోంది. మరోవైపు అగ్రరాజ్యమైన అమెరికాతో భారత్ సంబంధాలు పెరుగుతుండడాన్ని చైనా సహించలేక పోతోంది. కయ్యానికి కాలుదువ్వే చైనా కవ్వింపు ధోరణితో భారత్-చైనాల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఏదేమైనా, ఇరుదేశాలూ యుద్ధం మాటలు పక్కనపెట్టి.. సుహృద్భావ వాతావరణంలో.. సఖ్యతతో.. సంయమనంతో.. సమస్యలు చర్చించి పరిష్కరించుకోవడమే శ్రేయోదాయకం.**

భారత్-చైనా సరిహద్దుల్లో మాటల యుద్ధం రగులుకుంటోంది. సరిహద్దుల్లో సమస్యకు సరైన పరిష్కారం కనుగొనకపోతే భారత్‌పై చైనా యుద్ధానికి కూడా దిగవచ్చునంటూ చైనా విశ్లేషకులు హెచ్చరించేదాకా పరిస్థితి వచ్చింది. సిక్కిం సెక్టార్‌లోని డోక్‌లామ్ ప్రాంతం భూటాన్ పరిధిలోకి వస్తుందని, అక్కడ చైనా సైన్యం రోడ్డు నిర్మించడమంటే భారత్-చైనా సరిహద్దుల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఉన్న యథాతథ స్థితిని అతిక్రమించడమేనని భారత్ వాదన. అయితే, డోక్‌లామ్ ప్రాంతం తమదేనని, తమ భూభాగంలోకి జొరబడిన భారత సైనికులు వెనక్కి తగ్గాల్సిందేనని చైనా హెచ్చరిస్తోంది. దీనిపై మాటామాటా పెరిగి మాటల యుద్ధం దాకా వస్తోంది.

చరిత్రను చూసి పాఠాలను నేర్చుకోండంటూ 1962 నాటి యుద్ధాన్ని చైనా ప్రస్తావిస్తే, ఇప్పటి భారత్ 1962 నాటి భారత్ కాదు.. అని భారత్ సమాధానం. 'అవును. నిజమే.. ఇప్పుడు చైనా కూడా వేరు'.. అని చైనా అంటోంది. చైనా కవ్వింపు ధోరణి అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ఎంతోకాలంగా ఇరుదేశాలూ సఖ్యంగా ఉన్నప్పటికీ, ఇటీవలి కాలంలో భారత్-చైనాల మధ్య విభేదాలు వస్తూనే ఉన్నాయి. గతంలో కంటే సంబంధాలు ఇప్పుడు అంత సఖ్యంగా వుం డడం లేదు. సిక్కిం సరిహద్దులో వున్న డోక్‌లామ్ ప్రాంతంలో 2012లో భారత్ నిర్మించివున్న వున్న బంకర్లను తొలగించాలని చైనా కోరగా, భారత్ తిరస్కరించడం.. అందుకు ఆగ్రహించిన చైనా ఆ బంకర్లను కూల్చివేయడంతో వివాదం రాజుకుంది. ఆ తర్వాత చైనా సైనికులు డోక్‌లామ్‌లో రహదారిని నిర్మించే ప్రయత్నం చేస్తుండగా భారత సైనికులు అడ్డుకోవడంతో ఈ వివాదం మరింతగా జటిల మైంది. ఎప్పుడో సమసిపోయిందనుకున్న ఈ సరిహద్దు వివాదం ఇప్పుడు సరిహద్దుల్లో మరింత ఉద్రిక్తతను పెంచుతోంది. అయితే, తొలినుంచీ భారత్‌పై చైనాకు కంటగింపే ఉంది. ఒకవైపు భారత్‌తో చెలిమి చేస్తూనే, మరోవైపు ఏదోవిధంగా గిల్లికజ్జాలు పెట్టుకుంటూనే ఉండడం దాని నైజం. అనేక సందర్భాల్లో అది రుజువైంది. ఆ దేశాధ్యక్షుడు భారత్‌లో స్నేహంగా పర్యటిస్తూనే వున్న సందర్భంలో కూడా చేసుకున్న బాసలను అతిక్రమించి సరిహద్దుల్లో చైనా బలగాలు భారత్ భూభాగంలోకి వచ్చేందుకు ప్రయత్నించేసిన సందర్భాలున్నాయి. అంతేకాదు, భారత్‌పై నిరంతరం ఉగ్రవాద విషసర్పాలను వదులుతున్న పాక్‌కు అన్నివిధాలుగా అండదండలందిస్తోన్న చైనాకి ఇటీవలికాలంలో భారత్‌కు ప్రపంచవ్యాప్తంగా లభిస్తున్న ప్రతిష్ట కంటగింపుగానే ఉంది. అమెరికాలో భారత ప్రధాని మోడీకి అఖండస్వాగతం లభించిన తర్వాత చైనా మరింత అక్కసుతో ఉంది. భారత్‌పై మరింతగా కారాలు మిరియాలు నూరడమే పనిగా పెట్టుకుంది. అందులోనూ అగ్రరాజ్యమైన అమెరికాతో భారత్ దోస్తీని చైనా ఎంతమాత్రమూ సహించలేకపోతోంది. అందుకే అంతర్జాతీయస్థాయికి చెందిన అనేక విషయాల్లో భారత్ మాటను చైనా అసలు ఖాతరు చేయడం లేదు. ముఖ్యంగా ఉగ్రవాదంపై ఉమ్మడిపోరు సాగించే విషయంలో భారత్‌కు ప్రపంచవ్యాప్తంగా మద్దతు లభిస్తున్నా చైనా మాత్రం భారత్‌కు వ్యతిరేక వాదనలే వినిపిస్తోంది. పాకిస్తాన్‌కు చెందిన జైష్ ఏ మహ్మద్ అధినేత మసూద్ అజహర్‌పై ఐక్యరాజ్యసమితి నిషేధం విధించాలని భారత్ ప్రయత్నిస్తుంటే, అందుకు చైనా అడ్డుచక్రం వేస్తోంది. అంతేకాదు, అంతర్జాతీయస్థాయిలో 48 దేశాల కూటమి అయిన న్యూక్లియర్ సప్లయిర్స్ గ్రూప్ (ఎన్ఎస్‌జి)లో భారత్‌కు సభ్యత్వం వచ్చేందుకు అనేక దేశాలు సహకరిస్తున్నా, చైనా మాత్రం భారత్‌కు ఆ సభ్యత్వం లేకుండా చేసేందుకు లేనిపోని సాకులు చెప్తూ మోకాలడ్డుతోంది. మరోవైపు, భూటాన్, నేపాల్ దేశాలకు భారత్ చేయూతనివ్వడంపై కూడా చైనా భారత్‌పై గుర్రుగానే ఉంది. భారత్ సముద్రజలాల చుట్టూ ఓడరేవులను, నౌకాదళ స్థావరాలను నిర్మించుకోవడం..తద్వారా భవిష్యత్తులో భారత్‌ను భయపెట్టేందుకేనని వేరే చెప్పనక్కరలేదు. అందుకే, పాకిస్తాన్, మయన్మార్, బంగ్లాదేశ్, శ్రీలంక, మాల్దీవుల్లోని కొన్ని ప్రాంతాల్లో చైనా ముందస్తుగా సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకుంటోందన్న విషయం ప్రపంచానికి తెలిసిందే. నేపాల్, భూటాన్‌లు భారత్‌పై ఆర్థిక అవసరాలకు, రక్షణావసరాలకు ఆధారపడివున్న నేపథ్యంలో, చైనా అందుకు సహించక ఆ రెండు దేశాలను భారత్‌నుంచి దూరం చేసేందుకు భారత్‌పై రకరకాల విమర్శలు చేస్తూనే వుంది. తొలినుంచి తొందరపాటు తత్వం భారత్‌కు లేదు కనుకనే, చైనా చుట్టుపక్కల ఉన్న దేశాలతో భారత్ ఎంతోకాలం నుంచి మంచి స్నేహభావంతోనే ఉంటోంది.

ప్రధాని మోడీ రాకతో అటు అమెరికా నుంచి ఇటు భూటాన్ దాకా అనేక దేశాలు భారత్‌తో మంచి స్నేహసంబంధాలు కోరుకుంటున్న నేపథ్యంలో, ఇవన్నీ చైనాకు కంటగింపుగానే ఉంటున్నాయి. కేవలం ఆధిపత్యం కోసమే ఆరాటపడుతూ, మంచి స్నేహాన్ని సైతం అర్థం చేసుకోకపోగా, అపార్థం చేసుకోవడం వల్లే చైనాకు అసహనం కలుగుతోంది. మాటలతో తూటాలు పేల్చడం, కయ్యానికి కాలుదువ్వడం, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం వంటివి చైనాకు వెన్నతో అబ్బిన విద్య కనుక, రెచ్చ గొట్టే ధోరణితోనే ఏదోఒకరకంగా అవతలివారిని గుంతలోకి లాగాలన్న ఆలోచన సహజమే. అయితే, అలాంటి మాయమాటల్లో పడక తెలివిగానే ఈ సమస్యను అధిగమించాల్సి ఉంది.

ఏదేమైనా, యుద్ధం అనేది.. ఎవరికీ... ఏనాటికీ మంచిది కాదు. యుద్ధంతో విధ్వంసం జరుగుతుందే తప్ప సమస్యలు ధ్వంసం కావు. ప్రపంచమంతా శాంతిని, ప్రగతినీ కోరుకుంటుంటే..ఇంకా ఈ అధునాతన కాలంలో కూడా ఘర్షణలు, యుద్ధాలంటూ విద్వేషాలు పెంచుకోవడం ఏ దేశానికీ మంచిది కాదు.

ఇరుదేశాలవారూ సహనం వీడక.. సంయమనంతో.. సుహృద్భావ వాతావరణంలో శాంతియుతంగా.. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడం కంటే ఉత్తమమైన మార్గం మరొకటి లేదు.

# గాంధీజీ ఆశయాలను కొనసాగించాలి



గాంధీజీ ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని విక్రమ సింహపురి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.చంద్రయ్య అన్నారు. నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఈనెల 1వతేదీ ఆయన గాంధీ అధ్యయన తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ ప్రపంచ దేశాలకే ఆదర్శమన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ ఛైర్మన్ ఏ.వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గాంధీ మార్గం అనుసరణీయమని కొనియాడారు. డైట్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో క్షీణిస్తున్న విలువలను మెరుగుపరిచే కోర్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఆశ్రమ కమిటి కన్వీనర్ గణేశం కృష్ణారెడ్డి ఆశ్రమం గురించి విద్యార్థులకు వివరించారు. ఎంపిడిఓ వెంకటేశ్వరరావు, వెస్ట్ మేనేజిమెంట్ జిల్లా కో-ఆర్డినేటర్ సరళ, ఆశ్రమ కమిటి సభ్యులు నేదురుమల్లి సుబ్బారెడ్డి, ప్రచారకమిటి అధ్యక్షులు రొంపిచర్ల శివరామయ్య, మహిళా అధ్యక్షురాలు గూడూరు లక్ష్మి, లక్ష్మయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# సినారెకు 'పెరసం' అక్షర నివాళి



ఇటీవల దివంగతులైన ప్రఖ్యాత సినీకవి, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా. సి.నారాయణరెడ్డికి నెల్లూరులోని పెన్నా రచయితల సంఘం (పెరసం) ఆధ్వర్యంలో పలువురు కవులు, కవయిత్రులు అక్షర నివాళులర్పించారు. ఈ నెల 2న కస్తూర్బా కళాక్షేత్రంలోని ప్రజాసైన్స్ వేదిక కార్యాలయంలో కవిసమ్మేళనం ఏర్పాటుచేసి సినారెకి కవితా నీరాజనాలర్పించారు. తొలుత సినారె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెరసం అధ్యక్ష కార్యదర్శులు అవ్వారు శ్రీధరబాబు, గుండాల సురేంద్రబాబుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెరసం వ్యవస్థాపక అధ్యక్షుడు మోపూరు పెంచలనరసింహం, కార్యనిర్వాహక కార్యదర్శి గోవిందరాజు సుభద్రాదేవి, కార్యవర్గ సభ్యులు సుమలత, లక్ష్మీభవాని, నాగేంద్ర, రమేష్‌బాబు, ముసులూరు నారాయణ, శేఖర్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.




# మధ్యతరగతి పైనే భారం

భారతదేశంలో ఏ పన్ను వేసినా, ఏ వస్తువు ధర పెరిగినా బలయ్యేది మధ్యతరగతి మానవుడే! ధనవంతులు వ్యాపార రంగంలో వుంటారు. పెరిగిన భారాన్ని వాళ్లు తమపై ఉంచుకోరు. అలాగే అట్టడుగు వర్గాల వారికి అన్నీ ప్రభుత్వమే ఉచితంగా ఇస్తుంటుంది. వాళ్లకీ ఇబ్బంది లేదు. అన్ని విధాలా నలిగిపోయేది మధ్యతరగతి ప్రజలే! ఇప్పుడు కొత్తగా అమలులోకి తెచ్చిన జిఎస్‌టి ప్రభావం పడేది కూడా మధ్యతరగతి ప్రజల మీదే!

**వై.సి.రాంగోపాల్, ఓజిలి.**

# సభలకు మైదానాలు వాడుకోండి

నెల్లూరు నగరంలో రోడ్లు అసలే ఇరుకు. ట్రాఫిక్ ఎక్కువ. ఆటోలైతే సందుండదు. ఆర్టీసీ వైపు నుండి ఆత్మకూరు బస్టాండ్ వైపు పోవాలంటేనే నరకం కనిపిస్తుంటుంది. ఇలాంటి రోడ్లమీదే తుమ్మినా దగ్గినా ధర్నాలు చేస్తుంటారు. ముఖ్యంగా గాంధీబొమ్మ, అంబేద్కర్ బొమ్మల వద్దయితే ధర్నాలు, రాస్తారోకోలు నిత్యకృత్యమైపోయాయి. వీటివల్ల ట్రాఫిక్‌జామ్ ఏర్పడి వాహనచోదకులు, ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్‌లో ధర్నాచౌక్ లాగే నెల్లూరులో కూడా ధర్నాలు, రాస్తారోకోలు చేసుకోవడానికి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేని ఒక ప్రాంతాన్ని కేటాయిస్తే బాగుంటుంది. అలాగే నర్తకి సెంటర్‌లో బహిరంగ సభలు పెట్టడం వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడి ఆ రోడ్లో వ్యాపారస్తులు నష్టపోతున్నారు. కాబట్టి ఇక్కడకూడా బహిరంగ సభలు పెట్టకుండా నిషేధించాలి. కలెక్టర్, ఎస్పీలు ఈ సమస్యపై దృష్టి పెట్టాలి.

**వంగా మోహన్‌రావు, నెల్లూరు.**

# ఆర్‌ఎల్ రెడ్డి గ్రంథాలయానికి గ్రహణం

జిల్లాలోనే పెద్ద గ్రంథాలయం రేబాల దశరథరామిరెడ్డి గ్రంథాలయానికి గ్రహణం పట్టింది. దినపత్రికల పర్యవేక్షణ సరిగా లేదు. విద్యార్థులు, ప్రజలు దినపత్రికలలో సమాచారం కోసం నెల్లూరులోని జిల్లా ప్రధాన గ్రంథాలయంకు వస్తే న్యూస్ పేపర్స్ లేవు. ఉన్నవి కూడా ఆర్డర్‌లో లేవు. సమాచారం లేదు. గ్రంథాలయంలో ఉండే సిబ్బంది పట్టించుకోవడం లేదు. వారపత్రికలు, పుస్తకాల నిర్వహణ కూడా సక్రమంగా లేదు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కిలారి వెంకటస్వామి నాయుడు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్‌లు ఒక్కసారి ఈ గ్రంథాలయాన్ని తనిఖీ చేసి దీనిని దారిలో పెట్టాలి.

**- ఎస్. ఉమామహేష్, అడ్వకేట్, నెల్లూరు.**

# పోటెత్తిన అభిమానం



## బాలయ్య సాక్షిగా శీనయ్య ప్రమాణం

తన అభిమాన నాయకుడు, తన రాజకీయ జీవితానికి నిజమైన హీరో యువరత్న నందమూరి బాలకృష్ణ సమక్షంలో నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి(నుడా) ఛైర్మెన్‌గా ప్రమాణస్వీకారం చేయాలనుకున్న తన కోరికను కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తీర్చుకున్నాడు. జూన్ 30వ తేదీ నెల్లూరు, నర్తకి సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన బాలకృష్ణ సాక్షిగా ఆయన నుడా ఛైర్మెన్‌గా ప్రమాణస్వీకారం చేయడం జరిగింది. ఈ సభకు బాలకృష్ణ అభిమానులు, శీనయ్య అభిమానులు, తెలుగుదేశం కార్యకర్తలు, నందమూరి కుటుంబ అభిమానులు భారీగా తరలివచ్చారు. బాలకృష్ణతో పాటు రాష్ట్రమంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.నారాయణ, తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్, మేయర్ అబ్దుల్ అజీజ్, మాజీమంత్రి పరసారత్నం, మాజీఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీఎమ్మెల్యేలు కంభం విజయరామిరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కావలి ఏఎంసి ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కిలారి వెంకటస్వామినాయుడు, తెలుగుదేశం నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, సన్నపరెడ్డి పెంచలరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు. నుడా డైరెక్టర్‌లు షేక్ ఖాజావలి, పాలడుగు రంగారావు, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిలు కూడా ప్రమాణస్వీకారం చేసారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో బాలకృష్ణ నెల్లూరుతో తనకున్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. నెల్లూరు భాష, నెల్లూరు యాసతో పాటు నెల్లూరు చేపలపులుసన్నా తనకెంతో ఇష్టమని బాలయ్య చెప్పారు. మనుమసిద్ధి మహారాజు పరిపాలించిన ధన్యభూమి, మహాకవి తిక్కన మహాభారతాన్ని రచించిన పుణ్యభూమి నెల్లూరని పేర్కొన్నారు. 'నుడా' పరిధులను ఆయన వివరిస్తూ నెల్లూరుజిల్లా పారిశ్రామిక ప్రగతిలో దూసుకుపోతుందని, మరిన్ని పరిశ్రమలు ఇక్కడకు రానున్నాయని చెప్పారు. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పోరాటపటిమవున్న వ్యక్తని, పార్టీ ప్రతిపక్షంలో వున్నప్పుడు కూడా చిత్తశుద్ధితో పార్టీ కోసం శ్రమించాడని, కార్యకర్తలు ఆయన లోని పోరాటదక్షతను స్ఫూర్తిగా తీసుకోవాలని బాలయ్య చెప్పారు.



సభకు ముందు విఆర్ సెంటర్ నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు బాణాసంచా మోతలతో భారీ ర్యాలీ నిర్వహించారు. బాలయ్య కూడా ఈ ర్యాలీలో పాల్గొని దారిపొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ ఆకర్షణీయంగా నిలిచారు.

# ఆనందోత్సాహాల మధ్య కోటంరెడ్డి...



## కలల మందిరం ప్రారంభోత్సవం

విశ్రాంత ఉద్యోగులు, వయోవృద్ధులు ఒకచోట చేరి మాట్లాడుకునేందుకు, కాలక్షేపం చేసేందుకు ఒక వేదికను ఏర్పాటు చేయాలని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి భావించారు. ఈ ఆలోచన మేరకే ఇటీవల పొదలకూరు రోడ్డులో ఈఎస్ఐ ఆసుపత్రి ముందు 'పెద్దల కొలువు' పేరుతో సీనియర్ సిటిజన్స్ విశ్రాంతి మందిరాన్ని నిర్మించారు. అయితే స్లాబు కూడా పూర్తయిన ఈ నిర్మాణాన్ని అనుమతులు లేవంటూ ఇటీవల కార్పొరేషన్ సిబ్బంది కూల్చేయడం, దీనిపై కోటంరెడ్డి తీవ్ర ఆవేదనతో రగిలిపోయి ఆందోళనకు దిగడం తెలిసిందే! తిరిగి కార్పొరేషన్ అధికారుల అనుమతి తోనే కూల్చిన స్థలంలోనే ఆఘమేఘాల మీద 'పెద్దలకొలువు' మందిరాన్ని నిర్మించారు. కాగా, వందల సంఖ్యలో నెల్లూరు నలుమూలల నుండి హాజరైన సీనియర్ సిటిజన్స్ ఆనందోత్సాహాల మధ్య ఈ నెల 3వ తేదీ సాయంత్రం సీనియర్ సిటిజన్స్ చేతుల మీదుగానే ఈ పెద్దల కొలువును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు సీనియర్ సిటిజన్స్ కోటంరెడ్డిని అభినందనలతో ఆశీర్వదించారు. వృత్తిరీత్యా తాము దేశంలో, రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో పనిచేసామని, కాని, ప్రజల కోసం ఇంతగా తపించే ఎమ్మెల్యేను ఎక్కడా చూడలేదని కోటంరెడ్డిని మెచ్చుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పెద్దలను గౌరవించడమే కాదు, పూజించడం కూడా మన సాంప్రదాయమని, పెద్దల దీవెనలుంటే మనకంతా మంచే జరుగుతుందన్నారు. సీనియర్ సిటిజన్స్ విశ్రాంతి మందిరాలు తన కలల సౌధాలని, ఎన్నో కష్టనష్టాల మధ్య ఈరోజు ఈ మందిరాన్ని ప్రారంభించుకున్నామన్నారు. మరో 15రోజుల్లో కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో సీనియర్ సిటిజన్స్ పార్కును ప్రారంభించబోతున్నామని చెప్పారు. జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్ అనుమతులిస్తే మరో 4సీనియర్ సిటిజన్స్ మందిరాలను నిర్మిస్తానని ఆయన తెలిపారు.

# మద్యానికి కటకట

## వైన్‌షాపుల వద్ద కిటకిట



***మండు వేసవిలో జనం మంచినీళ్ళ కోసం కటకటలాడుతున్నారంటే అర్ధముంది. బోర్ల ముందు, ట్యాంకర్ల ముందు బిందెలతో క్యూ కట్టారంటే అర్ధముంది. మరి టీ షాపుల కంటే బెల్టు షాపులు, ఫ్యాన్సీ షాపుల కంటే వైన్‌షాపులు ఎక్కువుగా వున్న ఈ రాష్ట్రంలో మందుబాబులు మద్యానికి కటకటలాడడమేమిటి? ఈ సందేహం అందరికీ రావచ్చు. కాని ఈ నెల 1, 2, 3తేదీలలో మందుబాబులు మద్యం కోసం అలాగే కటకటలాడిపోయారు.***

జూలై 1వ తేదీ నుండి రాష్ట్రంలో కొత్త ఎక్సైజ్ పాలసీ అమలులోకి రావడం జరిగింది. జిల్లాలో 349 వైన్‌షాపులు, 43 బార్‌లు వున్నాయి. మూడు నెలల క్రితమే మద్యం దుకాణాలకు లాటరీ నిర్వహించి దుకాణాలను కేటాయించడం జరిగింది. అయితే కొత్త వైన్‌షాపులు, బార్లకు సుప్రీం కోర్టు ఆదేశాలు ప్రతిబంధకంగా మారాయి. జాతీయ, రాష్ట్ర రహదారులకు అరకిలోమీటరు దూరంలో వైన్‌షాపులు ఏర్పాటు చేసుకోవాలి. అలాగే గుడి, బడి, ఆసుపత్రుల విషయంలోనూ నిబంధనలు పాటించాలని సుప్రీం గట్టిగానే చెప్పింది. సుప్రీంకోర్టు నిబంధనలను తూ.చ తప్పకుండా పాటిస్తే మద్యం వ్యాపారులు ఎత్తిపోతారని భావించి, వారిపట్ల జాలి చూపించిన రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 42కిలోమీటర్లు జాతీయ, రాష్ట్ర రహదారులను జిల్లా ప్రధాన రహదారిగా డీనోటిఫై చేసింది. అయినా లాటరీ తగిలిన వాళ్లెవరూ 1వ తేదీ దుకాణాలు తెరవలేదు. జిల్లా వ్యాప్తంగా వైన్‌షాపులు మూత పడడంతో మద్యం కోసం మందుబాబులు అర్రులుచాచారు. ఫలానాచోట మద్యం అమ్ముతున్నారని ఎవరన్నా అంటే చాలు... అటువైపు పరుగులు తీసారు. ఈ రెండురోజులు మద్యం డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని మద్యాన్ని స్టాక్ పెట్టుకున్న వాళ్లు వాటిని రెండింతల ధరకు అమ్మి సొమ్ము చేసుకున్నారు.



# ప్రాణాలు తీస్తున్న పందేలు!

## బ్రతుకులు డొల్ల... భవిష్యత్ గుల్ల

***క్రికెట్... ఆడేవాళ్ళకు డబ్బులు, చూసేవాళ్ళకు ఆనందం... ఈ క్రికెట్ ప్రపంచంలో ఆడేవాళ్ళు చూసేవాళ్ళు కాకుండా ఇంకో జాతి వుంది. అదే బెట్టింగ్ జాతి. క్రికెట్‌ను అందరూ ఆటగా చూస్తే ఈ బెట్టింగ్ జాతి మాత్రం జూదంగా చూస్తుంది. ప్రపంచంలోనే ఈరోజు క్రికెట్ పెద్ద జూదమైపోయింది. ఆ జూదంలో వేలకోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయి. వాస్తవానికి క్రికెట్ ఆట ద్వారా ఆయా జట్లకు, ఆయా దేశాల క్రీడా సంఘాలకు వచ్చే ఆదాయం కంటే కూడా ఒక మ్యాచ్ జరిగితే బుకీలకే వస్తున్న ఆదాయం ఎక్కువ. అంతగా విస్తరించిపోయింది క్రికెట్ జూదం.***

క్రికెట్ బెట్టింగ్స్ ఎంతోమంది బ్రతుకులను బస్టాండ్ పాల్జేస్తున్నాయి. భవిష్యత్‌ను చిదిమేస్తున్నాయి. క్రికెట్ పందేల మత్తులోపడి మన జిల్లాలోనే ఆస్తులను కర్పూరంలా కరిగించిన వాళ్లున్నారు. బెట్టింగ్స్‌లో అప్పులపాలై చేస్తున్న వ్యాపారాలను, వున్న ఊరిని వదిలేసి పరారైన వారున్నారు. ఆఖరకు బెట్టింగ్‌ల మూలంగా బైక్‌ల దొంగతనాలకు పాల్పడి పోలీసులకు దొరికినవాళ్ళు కూడా వున్నారు.

కాగా, ఇటీవల జరిగిన క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో క్రికెట్ బెట్టింగ్స్ మూలంగా ఓ కుటుంబమే బలైపోయింది. క్రికెట్ బుకీల వేధింపులకు తట్టుకోలేక ముగ్గురు ఈ లోకాన్నే విడిచి వెళ్లారు. నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం సమీపంలో నివసిస్తున్న మల్లిఖార్జున, అతని భార్య మాధురి, కుమారుడు ప్రణబ్‌తో ఇటీవల విహారయాత్రలకని తమిళనాడులోని రామేశ్వరంకు వెళ్లారు. అక్కడ ఓ హోటల్ గది అద్దెకు తీసుకుని దిగారు. ఈ నెల 1వ తేదీ రాత్రి భార్యాభర్తలిద్దరూ విషం తాగి, కొడుకు గొంతులోనూ విషం పోశారు. తండ్రి కొడుకులు లాడ్జి గదిలోనే మృతి చెందగా, మాధురి మాత్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయింది. వీళ్ల ముగ్గురి చావుకు ఓ క్రికెట్ బుకీ వేధింపులే ప్రధానకారణంగా తెలుస్తోంది. ఓ రాజకీయపార్టీకి చెందిన ఈ బూకీకి నెల్లూరు నగరంలో జూదస్థావరాల నిర్వాహకుడిగా పేరుంది. పేరుకు ఒక పార్టీలో వున్నప్పటికీ అన్ని పార్టీల వారితోనూ ఇతనికి పరిచయాలుంటాయి. క్రికెట్ పందేలను నిర్వహించడం, బెట్టింగ్స్ ఓడిపోయిన వారి నుండి బలవంతంగా డబ్బులు వసూలు చేయడం చేస్తుంటారు. మల్లిఖార్జునకు కూడా బుకీ నుండి ఇటువంటి వేధింపులే ఎదురయ్యాయి. బుకీ ప్రతిరోజూ ఇంటికెళ్లి అవమానకర రీతిలో తిట్టొచ్చేవాడు. ఈ అవమానాలు భరించలేకే మల్లిఖార్జున భార్యాబిడ్డలతో సహా ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలుస్తోంది.

అంతర్జాతీయ క్రికెట్ టోర్నమెంట్స్, ఐపిఎల్ మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు జిల్లాలో భారీఎత్తున బెట్టింగ్స్ సాగుతున్నాయి. కొందరు బుకీలు వీటిని నిర్వహిస్తున్నారు. క్రికెట్ బెట్టింగ్స్ మూలంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అమాయకులు ఆస్తులను కాజేసుకుంటున్నారు. క్రికెట్ బెట్టింగ్స్‌పై పోలీసులు ఉక్కుపాదం మోపాల్సి వుంది. ఇకముందు ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా చూడాల్సివుంది.

# నెల్లూరు కబుర్లు

## వైసిపి... ఛలో ప్లీనరీ!

ఈ నెల 8, 9 తేదీలలో గుంటూరులో జరుగనున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాలకు జిల్లా నుండి పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. జిల్లా ప్లీనరీ విజయవంతమైన నేపథ్యంలో ఆ ఊపు ఉత్సాహంతో రాష్ట్ర ప్లీనరీకి కూడా కదులుతున్నారు. ప్రతి నియోజకవర్గం నుండి కూడా ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌ల నేతృత్వంలో కార్యకర్తలు ప్లీనరీకి వెళ్లనున్నారు.



## ఆకట్టుకున్న ఫోటో కొలేజ్

నెల్లూరు పొదలకూరురోడ్డులోని డైకస్‌రోడ్డు సెంటర్‌లో వున్న డాక్టర్ కిషోర్స్ రత్నం మోడల్ స్కూల్లో సోమవారం ప్రైమరి విద్యార్థులకు ఫోటో కొలేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల జిఎం రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను బయటకు తీసుకురావచ్చన్నారు. అందమైన ఆకృతుల్లో బొమ్మలు వేసిన విద్యార్థులను డైరెక్టర్లు డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు అభినందించారు. పాఠశాల సీనియర్ మేనేజర్ రాజేష్, ఏఓలు రుక్మిణి, సుప్రియారెడ్డి, సునీల్, రత్నం మోడల్ స్కూలు ప్రైమరి ప్రిన్సిపల్ విజయ, ప్రిన్సిపల్ రామచంద్రయ్య పాల్గొన్నారు.

## రంగనాథున్ని దర్శించుకున్న బాలయ్య



హిందూపురం ఎమ్మెల్యే, యువరత్న నందమూరి బాలకృష్ణ ఈ నెల 1వ తేదీన నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామిని దర్శించుకున్నారు. 'నుడా' ఛైర్మెన్ ప్రమాణస్వీకారోత్సవం కోసం 30వ తేదీ నెల్లూరొచ్చిన ఆయన ఆ రాత్రి ఇక్కడే బస చేశారు. 1వ తేదీ ఉదయం దేవాలయంకు వచ్చిన ఆయనకు ఆలయ ఛైర్మెన్ మంచికంటి సుధాకర్, కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు స్వాగతం పలికారు. ఆలయంలో శ్రీ రంగనాథుడిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు కిడాంబి జగన్నాధాచార్యులు ఆయనకు ఆలయ చరిత్రను వివరించారు. ఈ సందర్భంగా ఆలయంలో పడమర వైపు వున్న గోశాలను ఆయన ప్రారంభించారు. వేదమండితులు బాలయ్యను ఆశీర్వదించి స్వామివారి చిత్రపటాన్ని అందించారు. అలాగే బాలయ్య దర్గామిట్టలోని బారాషహీద్ దర్గాను కూడా దర్శించుకున్నారు.

### వై.టికి 'సింహ' పరామర్శ

తన రాజకీయ జీవితాన్ని తెలుగుదేశంపార్టీ సేవకే అంకితం చేసి, ఆ పార్టీలో వుంటూనే అనారోగ్యానికి గురైన తెలుగుదేశం సీనియర్ నాయకులు వై.టి.నాయుడును కూడా బాలయ్య పరామర్శించారు. పొదలకూరురోడ్డు, సంజయ్‌గాంధీనగర్‌లోని వై.టి. నాయుడు ఇంటికి ఆయన వెళ్లారు. వై.టితో ఎంతో అభిమానంగా మాట్లాడారు. ఆయన ఇంట్లో టిఫిన్ తిన్నారు. పార్టీపరంగా ఆయనకు పూర్తి సహాయసహకారాలు అందజేస్తానని బాలయ్య హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో ఆయన వెంట మున్సిపల్ మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మేయర్ అబ్దుల్ అజీజ్, 'నుడా' ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 8 నుంచి గురుపూర్ణిమ మహోత్సవాలు



నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతినగర్‌లోని సాయి దర్బార్ అద్దాల మందిరంలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు గురుపూర్ణిమ మహోత్సవాలు జరుగనున్నాయని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి మంగళవారం తెలిపారు. ఈ నెల 8వ తేదీ శనివారం ఉదయం 8.45 గంటలకు బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరం నుంచి రామచంద్రమూర్తి, సీతాలక్ష్మణ హనుమత్ సమేతంగా భక్తజన పరివారంగా సాయి మందిరంకు విచ్చేస్తారు. అనంతరం విష్వక్సేన పూజ, కలశస్థాపన, జ్యోతిప్రజ్వలన, ప్రత్యేకభజన, తీర్థప్రసాదాలను అందజేయనున్నామని తెలిపారు. సామాజిక సేవలో భాగంగా మోడరన్ ఐ హాస్పిటల్ రీసెర్చి సెంటర్ వైద్యబృందం ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన మెగా ఉచిత నేత్ర శస్త్ర చికిత్స శిబిరం జరుగుతుందని తెలిపారు.

## 'క్యాప్'లో చిన్నారుల జన్మదిన వేడుకలు



నెల్లూరులోని కొండాయపాళెం గేటు వద్ద వున్న క్యాప్(ఛైల్డ్ అండ్ పోలీస్ ప్రాజెక్ట్)లోని పలువురు చిన్నారుల జన్మదిన వేడుకలను ఈ నెల 2న ఘనంగా నిర్వహించారు. గూడూరులోని శ్రీకృష్ణ సేవాసమితికి చెందిన మాయూర్‌శ్యామ్, గంగుల మధుసూదనరావు, పెరుమాళ్ళ కొండయ్య ఈ కార్యక్రమంలో పాల్గొని 'క్యాప్' చిన్నారులు చందు, చందన, దివ్య, సంధ్యల జన్మదినవేడుకలు జరిపారు. ఆ చిన్నారులకు స్వీట్లు, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, డిక్షనరీలను బహుమతులుగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శరత్‌బాబు మాట్లాడుతూ, క్యాప్‌లో చదువుకున్న చిన్నారులంతా శ్రద్ధతో చదువుకుని భవిష్యత్‌లో ఉన్నతశిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. నగర డిఎస్పీ వెంకటరాముడు, ఏఆర్ ఆర్ఐ(వెల్ఫేర్) చంద్రమోహన్ పాల్గొన్నారు.

## ఐ.జి ని కలిసిన ఎస్పీ



ఈ నెల 3వ తేదీన గుంటూరు రేంజ్ ఐజిగా బాధ్యతలు తీసుకున్న కె.వి.ఐ. గోపాలరావును నెల్లూరు ఎస్పీ పి.హెచ్.డి. రామకృష్ణ కలుసుకున్నారు. జిల్లాలో శాంతి భద్రతలపై ఎస్పీతో ఐజీ చర్చించారు.

## బాధ్యతలు తీసుకున్న కొత్త తహశీల్దార్!

నెల్లూరు తహశీల్దార్‌గా ముత్యం నరసింహులు జూన్ 30వ తేదీ బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ తహశీల్దార్‌గా వున్న వి.శ్రీనివాసులురెడ్డిని గుంటూరుకు బదిలీ చేయడం జరిగింది.

## వాకర్స్ ఆధ్వర్యంలో డాక్టర్స్‌డే



ఈ నెల 1వ తేదీన నెల్లూరులోని విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్‌డేను విఆర్ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నో ఏళ్లుగా వైద్య వృత్తిలో వుంటూ సేవలందిస్తున్న పలువురు వైద్యులను సత్కరించారు. ఈ సందర్భంగా విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి మాట్లాడుతూ వైద్యవృత్తి ఎంతో పవిత్రమైనదని, మనిషిని దేవుడు సృష్టిస్తే, ఆ మనిషికి పునర్జన్మనిచ్చే శక్తి వైద్యులకే ఉందన్నారు. ప్రతి ఆసుపత్రిలోనూ వైద్యులు మానవతా దృక్పథంతో ప్రజలకు వైద్యసేవలు అందించాలన్నారు. అలాగే పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి జన్మదినం కూడా అదేరోజు కావడంతో వాకర్స్ ఆయనను కూడా శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ యం.వి.సుబ్బారెడ్డి, గవర్నర్ బి.మనోహర్‌రెడ్డి, ఇంకా వి.నాగేశ్వరరావు, జి.అనూరాధమ్మ, పి.నాగేశ్వరరావు, టి.వెంకటేశ్వర్లు, జి.వెంకటేశ్వరరావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## చికెన్ @240



ఓ పక్క మార్కెట్‌లో కూరగాయల రేట్లు మండిపోతున్నాయి. ఏ కూరగాయలు కూడా కొనేటట్లు లేవు, తినేటట్లు లేవు. పోనీ నాన్‌వెజ్‌కు పోదామా అంటే వాటి ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. మార్కెట్లో కిలో చికెన్(స్కిన్‌లెస్) 240 రూపాయలైంది. ఇటీవల కాసిన ఎండల దెబ్బకు కోళ్లు తగ్గిపోవడం వల్లే చికెన్ ధరలు ఇంతగా పెరిగాయంటున్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## 'నీట్' ఫలితాల్లో విశ్వసాయి విజయభేరి



ఇటీవల సిబిఎస్ఇ నిర్వహించిన నీట్–2017 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో నెల్లూరులోని విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ఛైర్మెన్ సత్యనారాయణ, వైస్ ఛైర్మెన్ కృష్ణమోహన్ ఆ విద్యార్థులను అభినందించారు. ఈ నెల 2న నగరంలోని మాగుంట లేఅవుట్‌లో వున్న ఆ కళాశాలలో అభినందన సభ ఏర్పాటుచేసి, అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులను అందరూ అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మెన్ మాట్లాడుతూ, ఈ విద్యాసంవత్సరం మెడికల్ విభాగంలో బి–కేటగిరీ ద్వారా 20 మంది, డెంటల్ విభాగంలో 60 మంది ఆయా విభాగాల్లో ప్రవేశాలకు అర్హత సాధించారని తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఎంబిబిఎస్, బిడిఎస్ ఫలితాల్లో తమ కళాశాల 49 శాతం వృద్ధిని సాధించిందని ఆయన పేర్కొంటూ, అటు విద్యార్థులను, కళాశాలను ఉత్తమస్థాయిలో తీర్చిదిద్దుతున్న అధ్యాపకులందరినీ ఆయన అభినందించారు.



## మాతా శిశు సంక్షేమానికే

# 'అన్న అమృతహస్తం'

మాతా శిశు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం 'అన్న అమృతహస్తం' పథకాన్ని ప్రారంభించిందని, ఈ పథకానికి నిధులు మంజూరు చేసి మాతా శిశు సంక్షేమానికి బాటలు వేస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈనెల 1న మంత్రి అల్లీపురంలోని సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి జడ్పీ హైస్కూల్ ఆవరణలో 'అన్న అమృతహస్తం' పథకం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గ్రామాల్లో వున్న గర్భవతులు, బాలింతలకు వారంలో అన్నిరోజులు మధ్యాహ్న భోజనాన్ని ఈ పథకం ద్వారా అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా, జిల్లాలో తొలిసారిగా వెంకటాచలం, రాపూరు, ఆత్మకూరు, ఉదయగిరి, గూడూరు రూరల్, పొదలకూరు, వెంకటగిరి, సూళ్ళూరుపేటల్లోని మొత్తం 8 ఐసిడిఎస్ ప్రాజెక్ట్‌లలో ఈ పథకం ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ పథకాన్ని విస్తృతపరుస్తూ కొత్తగా మరో 9 ప్రాజెక్ట్‌లలో ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. అల్లీపురంలోని ఆంజనేయస్వామి దేవస్థానం, కల్యాణమండపం నిర్మాణాలకి దేవాదాయ శాఖ నిధులను మంజూరు చేయిస్తామని, అదేవిధంగా రామాలయం శిథిలావస్థలో వుంది కనుక ఆ ఆలయ మరమ్మతులకు నిధులు మంజూరుచేస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ, పౌష్టికాహారం లోపంతో పుట్టబోయే బిడ్డలు అనేకమంది రకరకాల వ్యాధులకు గురవుతున్నారన్నారు. అన్న అమృతహస్తం పథకం ద్వారా గర్భవతులకు, బాలింతలకు మధ్యాహ్నభోజనంతో పాటు 200మి.లీ పాలు, కోడిగుడ్డు, ఐరన్‌మాత్రలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, మాజీ మంత్రి పరసా రత్నం, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చాట్ల నరసింహారావు, జాయింట్ కలెక్టర్-2 వెంకటసుబ్బారెడ్డి, ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి పి.డి ప్రశాంతి పాల్గొన్నారు.

# జనం గుండెల్లో లారీల దౌడ్!



నెల్లూరు నగరం 13వ డివిజన్ మిట్టపాళెం, బలిజపాళెం మీదుగా ఎ.పి.జెన్‌కోకు అర్ధరాత్రి వెళుతున్న భారీ వాహనాలను 3వ తేదీ స్థానిక ప్రజలు అడ్డుకున్నారు. వారికి అండగా నెల్లూరు నగర శాసనసభ్యులు డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ అక్కడకు చేరుకుని మరలా ఇటువంటి వాహనాలు రాకుండా వుండేలా చర్యలు చేపట్టాలని పోలీసులను కోరారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎ.పి.జెన్‌కోకు, కృష్ణపట్నం పోర్టుకు నేషనల్ హైవే నుంచి పోవాల్సిన పెద్దపెద్ద వాహనాలు ఈ రెండు గ్రామాల చిన్నరోడ్డు నుంచి పోతుండడంవలన అర్ధరాత్రుల్లు కరెంట్ తీసివేయడం, లారీల శబ్దాలతో ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటీవల ఒకసారి లారీలను అడ్డుకున్నందుకు సుమారు 16మందిపై దారుణంగా నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టి దాదాపు రెండు నెల పాటు వారిని జైలులో వుంచాల్సి వచ్చిందన్నారు. ఈరోజు బలిజపాళెం, మిట్టపాళెం రెండు గ్రామాల ప్రజలందరూ ఒక్కటయ్యారు. ఈ విషయమై పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, వాహనాలు వెళ్లే ఈ చిన్న రోడ్డుకు రెండు వైపులా బారికేడ్‌లు ఏర్పాటు చేసి పెద్దపెద్ద వాహనాలు వెళ్లకుండా నిరోధించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇసుక లోడుతో వెళ్లే వాహనాలు కూడా ఈ చిన్నరోడ్డుపై వెళ్లవద్దని, లేకుంటే జరిగే ప్రమాదాలకు వారే బాధ్యత వహించాలని అనిల్ అన్నారు. భారీ వాహనాలు వెళ్లేందుకు కరెంట్ తీసే లైన్‌మాన్‌పై కూడా చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను కోరడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఊటుకూరు మాధవయ్య, నాయకులు నక్కా శ్రీనివాసులు, తేలిమేటి రాజు, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

## • విజయవంతమైన జిల్లా వైసిపి ప్లీనరీ

# రేపటి గెలుపుకు ఈరోజే అడుగేద్దాం!




రేపు మనదే... గెలుపు మనదే... భవిష్యత్ మనదే! కష్టాన్ని భరిద్దాం, ఓటములను ఎదిరిద్దాం... మొండిధైర్యంతో పోరాడితే విజయం మన పార్టీ తలుపు తట్టడం ఖాయమంటూ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్లీనరీ సమావేశం ఈనెల 2వతేదీ నెల్లూరులోని అనిల్ గార్డెన్స్‌లో ఎంతో ఉత్సాహవంతమైన వాతావరణంలో జరిగింది. జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన కార్యకర్తలతో అనిల్ గార్డెన్స్ హాల్ కిక్కిరిసిపోయి అధికసంఖ్యలో కార్యకర్తలు బయటే నిలబడి పోవాల్సి వచ్చింది. వైకాపా జిల్లా అధ్యక్షులు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఒంగోలు, నెల్లూరు, తిరుపతి పార్లమెంటు సభ్యులు వై.వి.సుబ్బారెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వరప్రసాద్, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, కిలివేటి సంజీవయ్య, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మేకపాటి గౌతమ్‌రెడ్డి, మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, మాజీఎమ్మెల్యేలు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, వంటేరు వేణుగోపాలరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మేరుగ నాగార్జున, బి.సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు జంగా కృష్ణమూర్తి, వైసిపి జిల్లా నాయకులు నేదురుమల్లి పద్మనాభరెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, వైసిపి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, జడ్పీ వైస్‌ఛైర్మెన్ శిరీష, నెల్లూరు డిప్యూటీ మేయర్ యం.ద్వారకానాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తమ ప్రసంగాలలో నాయకులు తెలుగుదేశం ప్రభుత్వ విధానాలను తూర్పారబట్టారు. నెల్లూరుజిల్లా వైసిపికి కంచుకోటలాంటిదని, పార్టీ విజయానికి ఈ జిల్లానే సింహద్వారం కావాలంటూ నాయకులు, కార్యకర్తలలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా సమావేశంలో నాయకులు పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు.

సభకు ముందు నాయకులందరు కూడా సభాప్రాంగణంలో ఏర్పాటు చేసిన దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కాగా ఎలాంటి వాహనాలు ఏర్పాటు చేయకుండా, జనాన్ని తోలే పని పెట్టుకోకుండా ఈ సమావేశానికి స్వచ్ఛందంగా కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావడం పార్టీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపింది.

# జగన్‌పై డజను... కాకాణిపై అరడజను

**- కోటంరెడ్డి శీనయ్య**



వైకాపా రాష్ట్ర అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి మీద డజను, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మీద అరడజను కేసులున్నాయని, ఇలాంటి వాళ్ళు నీతికి నిలువెత్తు రూపమైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును విమర్శించడం కామెడీగా వుందని నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. 3వ తేదీ నెల్లూరులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల కోసమే జగన్ జైలుకెళ్లాడని జిల్లా వైసిపి ప్లీనరీలో చెప్పడం సిగ్గుచేటన్నారు. జగన్ ఎందుకు జైలుకెళ్లాడన్న సంగతి ఏ చిన్నపిల్లోడిని అడిగినా చెబుతారన్నారు. చంద్రబాబుకు హైదరాబాద్‌లో ఇల్లు ఎందుకని నెల్లూరు నగర ఎమ్మెల్యే అడిగాడు. మరి జగన్‌కు లోటస్‌పాండ్, బెంగుళూరులో ఇళ్లలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. వై.యస్.రాజశేఖరరెడ్డి ధనయజ్ఞం కోసం ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసి వదిలేస్తే, చంద్రబాబు వాటిని పూర్తి చేసి అన్ని ప్రాంతాలకు నీళ్లు వదులుతున్నారని చెప్పారు. 2019 ఎన్నికలే వైసిపికి చివరి ఎన్నికలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో టిడిపి నగర ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ధర్మవరం సుబ్బారావు, కె.బాలాజీ, శరత్‌చంద్ర, పి.రామచంద్రారెడ్డి, కిషోర్, మొయినుద్దీన్ పాల్గొన్నారు.

## • రిటైర్‌మెంట్

# విరమణ రోజే ప్రయోజనాలు



ఉద్యోగ విరమణ రోజే బెనిఫిట్స్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు నెల్లూరుజిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో ఈ నెల 1వ తేదీ ఉద్యోగ విరమణ పొందిన ఎస్సై, ఏఎస్సై, ఏఆర్‌ఎస్సైలు, కార్యాలయ ఉద్యోగులను ఎస్పీ సత్కరించి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందినవారికి ఎలాంటి ఇబ్బంది కలిగినా తన దృష్టికి తీసుకువస్తే సహకరిస్తామన్నారు. రిటైర్డు ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ త్వరితగతిన అందజేస్తామన్నారు. రిటైర్డ్ ఎస్సైలు సుదర్శన్‌రావు, వెంకట్రావు, కాలేషా, ఎఎస్సై శేషయ్య, ఏఆర్ఎస్సై ఆంథోని, రెహ్మత్ బాషా, రాజేశ్వరరావు, కార్యాలయ ఉద్యోగి అంజుమ్మలను సత్కరించారు. పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, అడిషనల్ ఎస్పీ శరత్‌బాబు, ఏఆర్ ఏఎస్పీ వీరభద్రుడు, రూరల్ డిఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, చంద్రమోహన్, తురకా శ్రీనివాసులు, శ్రీహరిరెడ్డి, గౌస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# శాకంబరిగా ఇరుకళల పరమేశ్వరీదేవి



సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి ఈ నెల 2న ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అమ్మవారికి శోభాయమానంగా శాకంబరి అలంకారం నిర్వహించారు. సుమారు 1250 కిలోల కాయగూరలు, దేశంలోని పలుచోట్ల నుంచి తెప్పించిన ఫలాలతో అమ్మవారు శాకంబరి అలంకారంలో నేత్రపర్వంగా భక్తులకు దర్శన మిచ్చారు. ఈ వేడుకకు ఉభయకర్తగా గంగిశెట్టి సాయికుమార్, ప్రసాద వితరణ ఉభయకర్తగా భోగాల గంగాధర్‌రెడ్డి వ్యవహరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని శాకంబరి అలంకారంలో తిలకించి తరించారు. విజయా డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, దేవస్థానం ధర్మకర్తలమండలి ఛైర్మెన్ మెట్టు సురేష్‌బాబు, ఆలయ నిర్వాహకులు వేమూరు గోపి తదితరుల పర్యవేక్షణలో ఈ వేడుక ఆద్యంతం ఎంతో కన్నుల పండువగా జరిగింది.

## అమృత్ ప్రాజెక్ట్ అధికారిగా కోటేశ్వరరావు

నెల్లూరు చెరువును సుమారు రూ.30 కోట్ల అమృత్ నిధులతో అభివృద్ధి చేయబోతున్నారు. ఇందుకు సంబంధించి కాంట్రాక్ట్ పద్ధతి కింద పూర్వ ఇరిగేషన్ జిల్లా ఎస్ఇ వి.కోటేశ్వరరావు సోమవారం మర్యాదపూర్వకంగా నగర కమిషనర్ ఎస్.ఢిల్లీరావును కలిసి చర్చలు జరిపారు. త్వరలో తెలుగుగంగ ప్రాజెక్ట్ కార్యాలయంలో నెల్లూరు చెరువు అమృత్ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. నెల్లూరు చెరువు అభివృద్ధి పనులను వేగంగా ప్రారంభిస్తామని, కమిషనర్ సహాయ సహకారాలు కావాలని ఈ సందర్భంగా కోటేశ్వరరావు కమిషనర్‌ను కోరారు. అందుకు పూర్తిగా సహకరిస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు.

# ఏసి వాకర్స్ వైద్యశిబిరం



నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల2న ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వాకర్ వైవి కృష్ణారెడ్డి సతీమణి ఇందిరమ్మ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టారు. అల్లూరు మండలంలోని చెన్నారాయునిపాలెంలో నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో అనేకమంది పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

కిమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అంకిరెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వేలూరు రంగారావు, వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 203 డిప్యూటీ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, స్వర్ణ రమేష్‌బాబు, సుప్రజ, గోపీ, డాక్టర్ సత్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

# అక్రమార్కులపై క్రిమినల్ కేసులు

**- డిఎస్పీ శ్రీనివాస్**



ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమార్కులు ఇసుకను తరలించినా, ఎర్రచందనం తరలించినా, బెల్టుషాపులు నిర్వహించినా క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ తెలిపారు. గూడూరు డిఎస్పీ కార్యాలయంలో 1వ తేదీ ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ ఎక్కడైనా మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే కఠినంగా చర్యలు వుంటాయని హెచ్చరించారు. గొలుసు మద్యం దుకాణాలు ఉన్నట్లు గుర్తిస్తే ఆ ప్రాంతంలోని మద్యం దుకాణం యజమానిపై, అమ్మే వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వం గుర్తించిన ఇసుక రీచ్‌లు కాకుండా అనుమతి లేకుండా ఉన్న ఇసుక రీచ్‌ల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే వాహనం డ్రైవర్, యజమానిపై చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలు తనిఖీ సమయంలో మద్యం సేవించి ఉంటే జైలుకు పంపుతామని స్పష్టం చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణా చేసే వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. పోలీసులకు వారంలో ఒకరోజు సెలవు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ సుబ్బారావు, ఎస్ఐలు నరేష్, సుధాకర్ ఉన్నారు.

# క్రీడలను అందరూ ప్రోత్సహించాలి




క్రీడాకారులకు బహుమతులందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

క్రీడలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, గూడూరు క్రీడాకారులు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందుతున్నారని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో రోటరీ స్పోర్ట్స్‌మీట్ ముగింపు కార్యక్రమాన్ని 1వ తేదీ నిర్వాహకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల వల్ల ఆరోగ్యంతో పాటుగా శారీరక ఉల్లాసం, మేధస్సు కలుగుతుందని చెప్పారు. క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను సమీక్షించి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. వివిధ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు, షీల్డులను అందించారు. క్రీడాకారులు గూడూరు పేరును ప్రపంచ స్థాయిలో నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యంరెడ్డి, మునిరాజా, పి.డి. సుబ్రహ్మణ్యం, బాలకృష్ణరాజు, శివకుమార్, స్టేట్‌బ్యాంకు ఏ.ఓ రమణయ్య, మల్లికార్జునరెడ్డి, జానకిరామిరెడ్డి పాల్గొన్నారు.

# పేదల సేవలో ఎనలేని సంతోషం

**- డాక్టర్ జనార్దన్‌రెడ్డి, డాక్టర్ రోహిణి**



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి

పేదలకు సేవచేయడంలో ఎనలేని సంతోషం, ఆప్యాయత, అనురాగాలు కలుగుతాయని డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి తెలిపారు. గూడూరు పట్టణంలోని సాయిబాబా కళ్యాణ మండపంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని వారు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోమంది పేదరికంతో వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారికి ప్రతినెల ఒకటి, మూడో ఆదివారాలు ఉచితంగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి పేదలకు సేవ చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. వైద్యపరీక్షలు అనంతరం ఉచితంగా మందులు అందించారు. వచ్చిన రోగులకు ప్రయాణ ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.20 చొప్పున ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి




విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని లయన్స్ క్లబ్ ప్రతినిధులు కడివేటి చంద్రశేఖర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నెలబల్లి భాస్కర్‌రెడ్డి, రియాజ్ అహ్మద్ అన్నారు. సోమవారం గూడూరు మండలం విందూరు ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నెలబల్లి భాస్కర్‌రెడ్డి నగదు ప్రోత్సాహకాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకొని తమ తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని తెలిపారు. విద్యార్థి దశ ఎంతో కీలకమని, విద్యతోనే ఏదైనా సాధించవచ్చునని చెప్పారు. అనంతరం విందూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఉంటూ డిప్యూటీ డిఇఓగా నియమితులైన ఇస్మాయిల్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు మురళీరెడ్డి, షేక్ రియాజ్‌అహ్మద్, సర్పంచి మల్లికార్జునరెడ్డి, ఎంపిటిసి సభ్యుడు అంకిరెడ్డి, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం చారిటీస్ సేవలు అభినందనీయం

ప్రజలకు సేవ చేయడం అభినందనీయమని తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి చేవూరు విజయమోహన్‌రెడ్డి అన్నారు. గూడూరు పట్టణంలోని ఏపిజె అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన ట్రస్టు ప్రతినిధి తాజుద్దీన్‌ను సోమవారం పలువురు నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మస్తాన్ బాషా, అరవ పార్వతయ్య, భాస్కర్‌గౌడ్, మగ్దూం, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.



గత నెల 30న గూడూరు ఎల్ఐసి కార్యాలయంలో సీనియర్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అయోధ్య శివసుబ్రహ్మణ్యం పదవీ విరమణ సందర్భంగా ఆయనను సన్మానించిన ఎల్ఐసి సేల్స్‌మేనేజర్ జయప్రసాద్‌బాబు, బ్రాంచ్ మేనేజర్ రవిచంద్రన్, డివోస్ అసోసియేషన్ కార్యదర్శి నజీర్ బాషా తదితరులు.

## మేషం

అశ్వని, భరణి, కృతిక 1 పాదము

శుభకార్య ప్రయత్నాలలో పాల్గొంటారు. ఉద్యోగార్థులకు అవకాశాలు కలిసివస్తాయి. కొత్త వసతులు సమకూర్చుకుంటారు. రాజకీయవర్గాలకు ఇబ్బందికర దినములివి. వృత్తి వ్యాపారాలలో ఇబ్బందులు తొలగి రాబడి పెరుగుతుంది. అవసరాలు ఏదో ఒక విధంగా నెరవేరగలవు. అయితే ఆర్థిక స్తబ్ధత ఉంటుంది. రావలసిన బాకీలు నిలబడిపోతాయి.

## కన్య

ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

అనవసర విషయాలలో శ్రద్ధ చూపవద్దు. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు దొరుకుతాయి. షేర్లు, స్థిరాస్తుల మీద ఆదాయం ఉంటుంది. కుటుంబసౌఖ్యం, ఆరోగ్య పరిస్థితి బాగుంటుంది. ఉద్యోగులకు పని భారం అధికారుల వత్తిడి ఎక్కువగా ఉంటుంది. ముఖ్య ఆర్థిక లావాదేవీలు వాయిదా పడతాయి. చేపట్టిన పనులు అయినవి అనిపిస్తారు.

## వృశ్చికం

విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

శుభకార్యాలు నిర్ణయం కాగలవు. సామాజిక సేవ, సమావేశాలలో పాల్గొంటారు. ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితులుంటాయి. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగ ప్రయత్నాలలో ఇంటర్వ్యూ అవకాశాలు, అనుకోని దూరప్రయాణాలు కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం ఉంటుంది. వ్యవహారాలు ఇంట బయట స్వయంగా పర్యవేక్షించండి.

## వృషభం

కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఉద్యోగులకు బాగా శ్రమ, పనిభారం ఉంటుంది. ఉద్యోగావకాశాలు లభించగలవు. కుటుంబ సౌఖ్యము, విద్యాప్రగతి బాగుంటుంది. వస్తు వాహన రిపేర్లుండగలవు. శుభకార్య ప్రయత్నాలను ముమ్మరంగా చేస్తారు. ఆరోగ్యం ఫరవాలేదు. ఖర్చులు బాగా పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరుగుతాయి. పలుకుబడి బాగుండి అనుకున్న పనులు జరిగిపోతాయి.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 7.7.2017 నుండి**
**తేది. 13.7.2017 వరకు**

ఈ వారం వృషభంలో శుక్రుడు, మిధునంలో రవికుజులు, 12తేది నుండి కర్కాటకంలో కుజుడు, కర్కాటకంలో బుధుడు, సింహంలో రాహువు, కన్యలో గురువు, వృశ్చికంలో శని, కుంభంలో కేతువు, వృశ్చిక ధనుర్మకర కుంభ రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 9 ఆదివారము గురుపూర్ణిమ

ముహూర్తములు లేవు.

### ఆషాఢ మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 7 | శుక్ర | చతుర్దశి | పూర్తిగ |
| తేది. 8 | శని | చతుర్దశి | ఉ॥ గం.7.0వ॥ |
| తేది. 9 | ఆది | పూర్ణిమ | ఉ॥ గం.8.50వ॥ |

### ఆషాఢ మాస కృష్ణపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 10 | సోమ | పాడ్యమి | ఉ॥ గం.10.20వ॥ |
| తేది. 11 | మంగళ | విదియ | ప॥ గం.11.32వ॥ |
| తేది. 12 | బుధ | తదియ | ప॥ గం.12.07వ॥ |
| తేది. 13 | గురు | చతుర్థి | ప॥ గం.12.15వ॥ |

## ధనుస్సు

మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కుటుంబసభ్యుల సహకారం, కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగులు తమ అధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. సమస్యలను రాజీ మార్గంలో పరిష్కరించుకుంటే మంచిది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. కొత్త కాంట్రాక్టులు, లీజులకు అనుకూలత బాగుంది. ఆర్థిక ఇబ్బందులుండినా డబ్బులు సర్దుబాటు కాగలవు.

## మిధునం

మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

దూర ప్రయాణాలు, సామాజిక సేవా కార్యక్రమాలకు వెళ్తారు. ఉద్యోగులు అధికారులతో, పబ్లిక్‌తో జాగ్రత్తగా ఉండాలి. యజమానులు వర్కర్లతో జాగ్రత్త పడండి. విద్యాప్రగతి బాగుంటుంది. రాజకీయ వర్గాల వారు విమర్శలు ఎదుర్కొనవలసి ఉంటుంది. అనుకున్న పనులు ఆటంకాలు తొలగి సవ్యంగా జరుగుతాయి. వ్యాపారాలు అభివృద్ధి చెంది ఆదాయం పెరుగుతుంది.

## మకరం

ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగులకు పనిభారం, వత్తిడి ఎక్కువగా ఉంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది. వస్తు, వాహన రిపేర్లుంటాయి. శుభకార్యాలు, సమావేశాలలో పాల్గొంటారు. ఆరోగ్యం జాగ్రత్త. కార్యనిర్వహణ సామర్థ్యం బాగుండినా జరుపదలచిన పనులకు ఆటంకాలుండగలవు. అందుచే కోపం టెన్షన్ ఎక్కువుగా ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులుంటాయి.

## కర్కాటకం

పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

విద్యాప్రగతి బాగుంటుంది. ఇతరుల పనులు చేయబోయి ఇబ్బందుల్లో పడతారు. బిడ్డల వివాహ ఉద్యోగ విషయాలలో శుభవార్త వింటారు. కొత్త కాంట్రాక్టులు, లీజులు లభించగలవు. కోర్టు వ్యవహారాలు, రావలసిన బాకీలు వాయిదా పడతాయి. ఆర్థిక ఇబ్బందులుంటాయి. వృత్తి వ్యాపారాలు నిరుత్సాహం కలిగిస్తాయి. పంతాలు పట్టుదలకు పోకుండా పనులు జరుపుకోవాలి.

## కుంభం

ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

అనుకున్న పనులు టెన్షన్‌తో జరుగుతాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంది. అనుకోని ప్రయాణాలుండటం, శుభవార్తలు వినడం, పెట్టుబడులు, వాణిజ్య విస్తరణకు అవకాశాలు దొరకడం ఉంటుంది. విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త. ఆర్థికంగా పరిస్థితులు సంతృప్తికరం. స్థిరాస్తులు, షేర్ల మీద ఆదాయం ఉంటుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు.

## సింహం

మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఋణాలివ్వడం, హామీలివ్వడం చేయవద్దు. కుటుంబ సౌఖ్యము బాగుంటుంది. పనులు నిదానంగా జరుగుతూ టెన్షన్ కలిగిస్తాయి. ఆరోగ్యం సరిగా ఉండదు. అనవసర విషయాలు, కుటుంబ వ్యక్తుల పనులు ఆందోళన కలిగిస్తాయి. ఆదాయ ఖర్చులు సమతుల్యంగా ఉంటాయి. వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం పెరుగుతుంది. విద్యార్థులు చదువుకై శ్రమిస్తారు.

## తుల

చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. కోర్టు కేసులు, రావలసిన బాకీలు వాయిదా పడతాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు లభించగలవు. విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త. తొందరపడి అతిగా విశ్వసించి ఇబ్బందులు పడతారు. విద్యా కృషి అవసరం. ఖర్చుల తాకిడి పెరుగుతుంది. కుటుంబసభ్యుల పనుల వల్ల ఇబ్బందులు పడతారు.

## మీనం

పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగావకాశాలు లభించగలవు. శుభవార్తలు వింటారు. ఉద్యోగులకు కార్యసామర్థ్యం, అధికారుల ఆదరణ బాగుంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. ప్రభుత్వ అనుమతులు లభించడం జరుగుతుంది. ఆరోగ్యం బాగుంటుంది. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి, రాబడి ఉంటుంది.

# నెల్లూరు కార్పొరేషన్ దెబ్బకు తోకముడిచిన చైనా

శ్రీను గల్పిక

ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయం. ప్రధాని నరేంద్రమోడీతో కేంద్ర మంత్రులు అరుణ్‌జైట్లీ, సుష్మాస్వరాజ్, సురేష్ ప్రభు, నితిన్ గడ్కరీ, వెంకయ్య నాయుడు, రక్షణశాఖ కార్యదర్శి అజిత్ ధోవల్, ఆర్మీ చీఫ్ బిపిన్‌రావత్ సమావేశమైవున్నారు. అక్కడ మోడీ, వెంకయ్య నాయుడులు తప్ప మిగతా అందరి ముఖాల్లోనూ టెన్షన్ సునామీలా పోటెత్తుతోంది. అరుణ్‌జైట్లీ వుండి ప్రధానితో... సార్, నేనేమో చైనాతో నోటికొచ్చినట్లు సవాళ్ళు చేసాను, 1962 నాటి భారత్ వేరు... ఇప్పటి భారత్ వేరు అని చెప్పాను. అవతల చూస్తే డోక్లాలో పరిస్థితి ఉద్రిక్తంగా వుంది. భూటాన్ భూభాగంలో తాము కడుతున్న రోడ్డును అడ్డుకున్నందుకు చైనా దళాలు కయ్యానికి కాలు దువ్వుతున్నాయి. చైనాతో పోలిస్తే మన మిలిటరీ, ఆయుధ సంపత్తి తక్కువ. యుద్ధం వస్తే గెలుస్తామా లేదా అని టెన్షన్‌గా వుంది అని చెప్పాడు. అది విన్న మోడీ... డోంట్‌వర్రీ జైట్లీ అని అన్నాడు. అది కాదు సార్, ఈరోజు చైనా అమెరికానే ఢీకొట్టే స్థాయిలో వుంది. దాని ముందు మనం నిలబడగలమా, సమస్యను శాంతియుతంగా పరిష్కరించే మార్గం ఆలోచించకూడదా? అని సుష్మాస్వరాజ్ కోరింది. సురేష్‌ప్రభు అందుకుని... యుద్ధంతో ఇరుదేశాలకూ నష్టమే. కాబట్టి ఇరు దేశాలు సంయమనం పాటిస్తే బాగుంటుందని సలహా ఇచ్చాడు. మీరేం దాని గురించి భయపడకంటి అని మోడీ ధైర్యం చెప్పాడు. నితన్ గడ్కరీ వుండి... మీరేం సార్, మీరు ధైర్యంగానే వుంటారు, ఆ చైనావాళ్ళు ఎక్కడ పైన పడతారోనని మేం భయపడి ఛస్తున్నాం అని అంటుండగానే... మమ్మల్ని మన్నించండి మహాప్రభో... అంటూ ఇద్దరు వ్యక్తులు పరుగు పరుగున వచ్చి మోడీ కాళ్ల మీద పడ్డారు. అలాగే మన్నించాలే ఇక లేవండి అంటూ మోడీ వాళ్లిద్దర్నీ లేవదీసాడు. ఆ ఇద్దరి ముఖాలను చూసి అక్కడున్న వాళ్ళు నివ్వెరపోయారు. వాళ్లిద్దరూ ఎవరో కాదు... చైనా అధ్యక్షుడు, ప్రధాని జింగ్ పింగ్, జీహూంటావోలు. వాళ్లిద్దరు మోడీ చేతులు పట్టుకుని... మేం అనవసరంగా కయ్యానికి కాలు దువ్వాం. మీ శక్తిసామర్థ్యాలను అంచనా వేయలేకపోయాం. ఇరుదేశాల వారిమి కలిసి మాట్లాడుకుని సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకుందాం. వెంటనే మా దేశ సరిహద్దుల్లో మోహరించిన మీ శక్తులను వెనక్కి పిలిపించండి అని వేడుకున్నారు. సరే, అలాగే అని మోడీ అభయమిచ్చాడు. అది విన్న ఆర్మీచీఫ్ బిపిన్‌రావత్... సరిహద్దుల్లో వున్న సైన్యాన్ని వెనక్కి పిలిపించేనా అని మోడీని అడిగాడు. దానికి మోడీ... వాళ్ళు భయపడుతున్నది సైన్యానికి కాదు అని అన్నాడు. మరి ఎవరికి...? అసలు ఏం జరిగింది, వాళ్ళను ఎలా వంచగలిగారని వెంకయ్య తప్ప మిగతావాళ్లంతా ఆతృతగా అడిగారు. అందుకు మోడీ... చెబితే ఫీలింగ్ వుండదు. చూడండి అంటూ... వేళ్లతో ఎయిర్ స్క్రీన్ గీసి సీన్స్ ప్లే చేసాడు.

★★★★★

తన ఛాంబర్‌లో ప్రధాని మోడీ దిగులుగా కూర్చుని వున్నాడు. అప్పుడే కేంద్రమంత్రులు వెంకయ్య, అశోక గజపతిరాజు, సుజనాచౌదరిలు లోపలకు వచ్చారు. విచారంగా వున్న మోడీతో... ఏం అలా వున్నారని వెంకయ్య అడిగాడు. సిక్కిం సరిహద్దుల్లో చైనా యుద్ధానికి కాలు దువ్వుతోంది. మనం వెనక్కి తగ్గకూడదు. కాకపోతే చైనా బలం ముందు మన బలం సరిపోతుందా? లేదా అనే నా సందేహం అన్నాడు. సుజనాచౌదరి వుండి... సార్, మా టాలీవుడ్ హీరోలు బాలకృష్ణ, ప్రభాస్, రామ్‌చరణ్, పవన్‌కళ్యాణ్‌లు వున్నారు. మా బాలయ్య పారాచూట్ తగిలించుకుని ఒక్కడే పాకిస్థాన్ వెళ్లి అక్కడి శత్రువులను తుదముట్టించగలడు. బాలయ్య ఒకసారి తొడ కొడితే ఆ సౌండ్‌కు ఒకేసారి వంద మంది చస్తుంటారు. అదీగాక చైనా సైనికులు కాల్చిన బుల్లెట్లను నోటితో పట్టుకుని వాటితోనే తిరిగి వారిని కాల్చి చంపగల దిట్ట. కాబట్టి బాలయ్యను సరిహద్దుల్లో పెట్టి తొడ గొట్టించి చైనానే పడగొట్టించే పని చేద్దాం. ఇక రామ్‌చరణ్ వందమంది వీరులు ఒకేసారి వచ్చినా మట్టి కరిపించగలడు. లక్షమంది సైన్యమున్న కాలకేయుడినే మట్టికరిపించిన ధీశాలి బాహుబలి ప్రభాస్. ఇక పవన్ కళ్యాణ్... ఒక్కడు వుంటే సరిహద్దుల్లో వెయ్యి సింహాలున్నట్లే లెక్క. సింహానికి ఆయనకు ఒకటే తేడా... అది పెళ్లి చేసుకోదు, ఈయన చేసుకుంటాడంతే... మిగతాదంతా సేమ్ టు సేమ్ అని చెప్పాడు. అది విన్న వెంకయ్య... నీ సినిమా తెలివి తెల్లారినట్లే వుంది. సినిమా హీరోలు నిజజీవితంలో హీరోలు కాలేరు అంటూ... సార్, ఒక్కో సారి యుద్ధంలో శక్తితో పాటు యుక్తి కూడా అవసరం అంటూ.. సెల్‌ఫోన్ తీసి 98494 59590 నెంబర్‌కు డయిల్ చేసాడు. అవతల స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానందరెడ్డి(66) లైన్‌లోకి వచ్చాడు. వెంకయ్య ఆయనకు ఫోన్‌లోనే సమస్యను చెప్పాడు. వివేకా కూడా ఫోన్‌లోనే పరిష్కారం చెప్పాడు.

★★★★★

నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్ తన గదిలో నిద్రపోతున్నాడు. అప్పుడే ఆయన సెల్ మోగింది. ఫోన్ ఎత్తాడు. అవతల వెంకయ్యనాయుడు... వెంకయ్య ఫోన్‌లో సబ్జెక్ట్ చెప్పాడు. అజీజ్ అలాగే, సాయంత్రం కల్లా చేరుస్తాను సార్ అంటూ ఫోన్ పెట్టేసాడు. ఆ తర్వాత వెంకయ్య నెల్లూరు ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్‌లతోనూ మాట్లాడాడు. దేశ రక్షణ కోసం మావంతు సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చారు.

★★★★★

అది చైనాలోని ప్రముఖ వార్తాపత్రిక 'గ్లోబల్ టైమ్స్'. ఆరోజు పతాక శీర్షిక "సరిహద్దుల్లో యుద్ధ మేఘాలు - చైనాపై దాడికి జీవాయుధాలు" అని హెడ్డింగ్‌తో వుంది. వార్తా, సారాంశం... డోక్లా ప్రాంతంలో రోడ్డు వివాదమై చైనా, భారత్‌ల మధ్య ఉద్రిక్తతలు తలెత్తాయి. భారత్ నుండి చైనాకు ఊహించని ముప్పు ఎదురైంది. భారత్ చైనాపై దాడికి తన సరిహద్దుల్లో 'ఐఆర్ 20-420 నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమల'ను భారీ ఎత్తున మోహరించింది. బుల్లెట్ తగిలితే, బాంబు పడితే మనిషి ఒక్కసారే ఛస్తాడు. కాని ఈ దోమ దాడికి గురైన వ్యక్తి ఒక్కసారి కాకుండా ప్రతిరోజూ ఛస్తుంటాడు... ఈ దోమల దాడితో చైనా సాయుధ దళాలే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థ కూడా పూర్తిగా నాశనమవుతుంది. ఈ దోమల బారిన పడిన ప్రజలెవరూ సుఖంగా వుండరని, రకరకాల వింత వ్యాధులు వచ్చి చనిపోతుంటారని శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఈ రోగాల బారి నుండి చైనాను కాపాడుకోవాలంటే భారత ప్రధాని మోడీని శరణుకోరడం తప్ప మరో మార్గం లేదు. అని కథనాన్ని ప్రచురించింది. మీడియాలో వచ్చిన ఈ కథనంతో చైనా ప్రజల్లోనూ ఆందోళనలు రేకెత్తాయి. కమ్యూనిష్టు నిరంకుశ ప్రభుత్వాన్ని కూడా లెక్క చేయకుండా కోట్లాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నెల్లూరు దోమల నుండి చైనాను కాపాడాలంటూ ర్యాలీలు చేయసాగారు. ప్రజల ఆందోళనలకు తలొగ్గి జింగ్‌పింగ్, జీహుంటావోలు భారత ప్రధాని మోడీని కలిసి సంధి కోరుతామని ప్రకటించారు.

★★★★★

ఎయిర్ స్క్రీన్‌పై ఇక్కడితో సీన్‌లు ముగిసాయి. వారితో మోడీ... చూసారా నెల్లూరు మస్కిటోస్ పవర్... అందుకే చెప్పేది... సృష్టిలో ప్రతి జీవి కూడా ఏదో ఒకరోజు ఏదో ఒక విధంగా ఉపయోగపడుతుందని. ఈరోజు నెల్లూరు నేతలు, నెల్లూరు దోమల వల్ల చైనా బారి నుండి దేశాన్ని రక్షించుకోగలిగామన్నాడు. మోడీ నెల్లూరు గురించి అంతగా చెప్పేసరికి వెంకయ్య ఛాతి గర్వంతో 24సెంటీ మీటర్లు పెరిగి వేసుకున్న చొక్కా చినిగిపోయింది.

# నీట్‌లో 'రత్నం' సూపర్‌హిట్



నీట్ ఫలితాల్లో నెల్లూరు రత్నం జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని కళాశాల ఛైర్మన్ కె.వి.రత్నం తెలిపారు. నెల్లూరు నగరంలోని ఇస్కాన్‌సిటీలో ఉన్న కళాశాలలో ఆదివారం ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జొన్నలగడ్డ ప్రీతి 590 మార్కులతో 247వ ర్యాంకు, విష్ణువర్ధన్‌రెడ్డి 572 మార్కులతో 399వ ర్యాంకు, శివానీ 564 మార్కులతో 488వ ర్యాంకు, మునిసాయి వర్షిత 564 మార్కులతో 494వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. వీరితో పాటు 518, 705, 729, 806, 921, 949, 953 ర్యాంకులను తమ విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. మొత్తం వెయ్యిలోపు 11మంది, రెండువేల లోపు 27మంది, మూడువేల లోపు 39మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారన్నారు. వివిధ కేటగిరీల్లో కళాశాల విద్యార్థులకు 135కుపైగా మెడికల్, డెంటల్ సీట్లు వస్తాయని తెలిపారు.

# నెల్లూరులో జీఎస్టీ సహాయకేంద్రం

నెల్లూరు నగరంలోని ఆర్ఆర్ వీధిలో ఉన్న రాష్ట్ర పన్నుల శాఖ కార్యాలయం ఆవరణంలో బుధవారం జీఎస్టీ సహాయకేంద్రం ప్రారంభమైంది. ఆ శాఖ సంయుక్త కమిషనర్ ఎన్ఇ కృష్ణమోహన్‌రెడ్డి ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాణిజ్యవర్గాల్లో జీఎస్టీ వల్ల కలిగే సందేహాలు నివృత్తి చేసి, వారికి చట్టపరమైన అంశాల్లో మార్గదర్శకత్వం వహించేందుకు ఈ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 దాకా ఇది అందుబాటులో ఉంటుందని, జీఎస్టీపై వచ్చిన సందేహాలను తీరుస్తూ ఆన్‌లైన్‌లో వివరిస్తారని పేర్కొన్నారు. జీఎస్టీపై సందేహాలున్నవారు సహాయకేంద్రంలోని 0861-2325403, లేదా 9963993270 ఫోన్ నంబర్లకు సంప్రదించాలన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎవిఎస్ కృష్ణమోహన్, కెవి చలమయ్య, కృష్ణారెడ్డి, భాస్కరరావు, ఝాన్సీ, సోమశేఖరరెడ్డి, శివప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

# జక్కా సౌదామిని వర్ధంతి



ప్రముఖ వదాన్యులు, నెల్లూరులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాత జె.ఎస్.రెడ్డి సతీమణి స్వర్గీయ శ్రీమతి జక్కా సౌదామిని 8వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 8వ తేదీ శనివారం సాయంత్రం 6గంటలకు నెల్లూరు టౌన్‌హాల్లో ప్రఖ్యాత గజల్ గాయకులు డా॥ గజల్ శ్రీనివాస్‌చే గజల్ గానకచ్చేరి నిర్వహిస్తున్నారు. జక్కా రంగారెడ్డి స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి సంగీతప్రియులు, గజల్ అభిమానులు, జక్కా కుటుంబ ఆత్మీయులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

## కాలధర్మం
# కలికి సుగుణమ్మ



కీ॥శే॥ కలికి రమణారెడ్డి సతీమణి కలికి సుగుణమ్మ జూలై 4వ తేదీ మంగళవారం మధ్యాహ్నం కన్నుమూశారు. ఆమె వయస్సు 85 సంవత్సరాలు. జలదంకి మండలం జమ్మలపాలెం వీరి స్వగ్రామం కాగా దశాబ్దాల కాలం నాడే తమ బిడ్డల విద్య కోసం రమణారెడ్డి దంపతులు నెల్లూరుకు వచ్చేశారు. రమణారెడ్డి - సుగుణమ్మలకు నలుగురు సంతానం. ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. రైస్ మిల్ వ్యాపారం ద్వారా నెల్లూరులో స్థిరపడిన రమణారెడ్డి 1986లోనే తన 65వ యేట కన్నుమూశారు.

రమణారెడ్డి - సుగుణమ్మల పెద్దకుమారుడు కలికి రామ్మోహన్‌రెడ్డి జిల్లాలో ప్రముఖ వ్యాపారవేత్తగా అందరికీ సుపరిచితుడు కాగా ఆయన శ్రీమతి డా॥ హైమావతి నారాయణ ఆసుపత్రిలో ప్రముఖ వైద్య నిపుణురాలుగా ప్రసిద్ధి.

ఆధునిక భావాలు కలిగిన రామ్మోహన్‌రెడ్డి తన తల్లి పెద్దకర్మ సైతం రెండవరోజే (6వ తేదీ) ముగించేశాడు. ఆమె జ్ఞాపకార్థం 11వ రోజు కొరకు అయ్యే ఖర్చు మొత్తాన్ని నెల్లూరులోని ప్రముఖ అనాథశరణాలయం "వాత్సల్య"(వానప్రస్థ)కు ఆర్థిక సహాయం రూపంలో అందించ దలచినట్లు చెప్పారు. కలికి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# 2018కల్లా భూగర్భ డ్రైనేజీ పూర్తి



2018 సంవత్సరం చివరికల్లా నగరంలోని భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తవుతాయని నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. నగరంలో ఇప్పటి వరకు 43శాతం భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తయినట్లు చెప్పారు. 5వ తేదీ నెల్లూరు నగరపాలక సంస్థ స్థాయీసంఘ సమావేశం మేయర్ అజీజ్ అధ్యక్షతన జరిగింది. మొత్తం 25అంశాలతో అజెండాను సమావేశంలో పెట్టగా 24అంశాలకు మాటా పలుకు లేకుండా ఆమోదం తెలిపారు. 29వ డివిజన్‌లో 49లక్షల కాలువ, కల్వర్ట్ పనికి మాత్రం మేయర్ ఒప్పుకోలేదు. కార్పొరేషన్ పరిధిలో చదువుల అభివృద్ధికి 3.5కోట్లు కేటాయించారు. కార్పొరేషన్ గురుకుల జూనియర్ కళాశాలకు 89.24 లక్షలు ఖర్చు చేసినట్లు ఎజెండాలో చూపించారు. దానికీ ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ ఢిల్లీ రావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు మన్నెం పెంచలయ్య, మామిడాల మధు, ప్రశాంతి కిరణ్, నెల్లూరు సునీతలు పాల్గొన్నారు.

# బీజేపీ బలోపేతానికి ప్రచారం ముమ్మరం




నెల్లూరుజిల్లాలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని ఈ క్రమంలోనే కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలను బుధవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు గ్రామస్థాయిలో ప్రచారం చేస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి తెలిపారు. మంగళవారం నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి కమిటీలను బలోపేతం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, జిల్లాలో 2,200 బూత్‌కమిటీలను బలోపేతం చేయాలని నిర్ధారించగా ఇప్పటివరకు 1500కమిటీలు పూర్తి చేశామని తెలిపారు. జనతాపార్టీ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ 116వ జయంతిని పురస్కరించుకుని విస్తృత స్థాయిలో మొక్కలు నాటుతామన్నారు. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు చొరవతో నెల్లూరు రైల్వేస్టేషన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. బీజేపీ రాష్ట్ర అధికారప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ ఎంఐఎం అధినేత అక్బరుద్దీన్ ఒవైసీ మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఆయనను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సదావర్తి భూములపై హైకోర్టు తీర్పు హర్షణీయమన్నారు. జీఎస్‌టీతో అన్ని వర్గాలకు న్యాయం చేకూరుతుందన్నారు. మండ్ల ఈశ్వరయ్య, శ్రీనివాసులు, మధు, గౌసయ్య, జిలానీ, సాయి శ్రీనివాస్, జనార్ధన్, కాళేశ్వరరావు పాల్గొన్నారు.

# శ్రీ కుసుమహరనాథ బాబా 152వ జయంతి



నెల్లూరులోని ఫణతులవారివీధిలో వున్న శ్రీ కుసుమ హరనాథ బాబా మందిరంలో ఇటీవల బాబావారి 152వ జయంతి కార్యక్రమాలను ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకృష్ణ తత్వంపై ఆయన ప్రజలకు ఎన్నో బోధనలు చేసి, శ్రీకృష్ణ ప్రేమ సందేశాన్ని ప్రజలకు అందించి ఆదర్శ గురువుగా పేరొందారు. బాబావారి జయంతిని పురస్కరించుకుని మందిరంలో సుప్రభాతసేవ, అభిషేకం, అర్చనలతో పాటు 12గంటలపాటు నిర్విరామంగా 'జయ హరనాథ.. జై- జై కుసుమకుమారి జై' అంటూ బాబావారి నామాన్ని జపించారు. ఆ తర్వాత భక్తులందరికీ అన్నవితరణ గావించారు. ఈ కార్యక్రమంలో మందిర నిర్వాహకులు ఆర్ఆర్‌కె చక్రవర్తి, ఓ.వెంకటకృష్ణయ్య, వివి శేషగిరిరావు, బి.కృష్ణసింగ్, ఎం.తిరుమల, మనోహరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రంగనాథస్వామి దేవాలయంలో వనం-మనం



నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో 5వ తేదీ 'వనం-మనం' కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని, ప్రతి ఒక్కరూ పచ్చదనాన్ని పెంచేందుకు ప్రతి ఇంట మొక్కలు నాటాలని ఆలయ నిర్వాహకులు ఈ సందర్భంగా కోరారు. ఆలయ ఛైర్మెన్ మంచికంటి సుధాకర్, ఇ.ఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు కాకరపర్తి జగన్మోహన్‌రావుల ఆధ్వర్యంలో ఈ కార్య క్రమం జరిగింది.

# రంగనాథ స్వామికి క్షీరాభిషేకం



నెల్లూరు రంగనాయకులపేటలో కొలువైన శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో మంగళవారం తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్సవ విగ్రహాలకు 108 లీటర్ల పాలతో క్షీరాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం మంగళవాయిద్యాలతో, వేద పండితుల వేద మంత్రోచ్చారణలతో భక్తుల జయజయధ్వానాల మధ్య స్వామివారికి నిర్వహించిన బంగారు గరుడ సేవ మహోత్సవం కనులపండువగా జరిగింది. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తజన సందోహంతో దేవస్థానం పరిసరాలు కిక్కిరిసాయి. తొలుత స్వామివారిని పట్టు పీతాంబరాలు, వివిధ ఆభరణాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం స్వామివారిని బంగారు గరుడవాహనం పైకి చేర్చి ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మెన్ మంచికంటి సుధాకరరావు, ఇ.ఓ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

### శ్రీ దత్తసాయి భరద్వాజ మందిరంలో

# 9న గురుపూర్ణిమ మహోత్సవాలు

ఈ నెల 9న గురుపూర్ణిమ సందర్భంగా నెల్లూరు కొండాయపాళెం గేటు వద్ద ఉన్న రవీంద్రనగర్ 2వ వీధిలోని శ్రీ దత్తసాయి భరద్వాజ మందిరంలో వేడుకగా గురుపూర్ణిమ మహోత్సవాలు నిర్వహిస్తామని మందిరం నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉదయం 6గంటలకు స్వామివారికి కాకడ హారతి, 8గంటల నుంచి అభిషేకం నిర్వహిస్తామని, 9 గంటలకు ఉభయకర్తల పూజల అనంతరం 10 గంటలకు సాయినాధునికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 12-30 గంటలకు మధ్యాహ్న హారతి ఉంటుందని తెలిపారు. అనంతరం, మధ్యాహ్నం 1గంటకు అన్న సంతర్పణ నిర్వహిస్తామన్నారు. గురుపూర్ణిమ శాశ్వత ఉభయకర్తలైన శేఖరమంత్రి రామమోహనరెడ్డి-శ్రీమతి సుజనితో పాటు, అన్నసంతర్పణ ఉభయకర్త బాటిరెడ్డి వినీత్‌రెడ్డి-శ్రీమతి మణిహారిక, పూలంగిసేవ ఉభయకర్త శేఖరమంత్రి మణితేజరెడ్డి-శ్రీమతి నవ్య తదితరుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహిస్తామన్నారు. భక్తులందరూ ఈ వేడుకల్లో పాల్గొని స్వామివార్ల కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## వేదగిరి నృసింహుడ్ని దర్శించుకున్న సత్యాత్మతీర్థ స్వామి

నెల్లూరురూరల్ మండలంలోని నరసింహకొండలో కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయాలను ఉత్తరార్థ పీఠాధిపతి సత్యాత్మతీర్థ స్వామి గత నెల 30వ తేదీన దర్శించుకున్నారు. తొలుత ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ కార్య నిర్వహణాధికారి అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ప్రధానార్చకుడు అప్పలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

### డికెడబ్ల్యు కాలేజి ప్రిన్సిపల్

## బాధ్యతల స్వీకరణ

నెల్లూరులోని డికెడబ్ల్యు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా బి.వెంకయ్య సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇనమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పని చేస్తూ ఆయన బదిలీపై వచ్చారు. వెంకయ్య గతంలో జిల్లా వృత్తి విద్యాశాఖాధికారిగా పని చేశారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ కళాశాలను అభివృద్ధి చేసేందుకు అందరి సహకారం తీసుకుంటానన్నారు. వెంకయ్యను కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, హాస్టల్ డిప్యూటీ వార్డెన్ ఎ.భారతిలు సన్మానించారు.

### గ్రామీణ యువతకు

## ఉపాధి రంగాల్లో శిక్షణ

వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న సైరడ్ సంస్థలో యువతకు ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించామని, ఈ నెల 17 నుంచి శిక్షణ ఉంటుందని సైరడ్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్ సర్వీసింగ్, ఎయిర్‌కండిషన్, రిఫ్రిజిరేటర్ కోర్సుల్లో ఈ శిక్షణ ఇస్తామన్నారు. కంప్యూటర్ హార్డ్‌వేర్‌లో 45రోజుల పాటు, మిగిలిన విభాగాల్లో నెలరోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. 18 నుంచి 45ఏళ్ళలోపు వయసు ఉన్నవారు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఎయిర్ కండిషన్, రిఫ్రిజిరేటర్ కోర్సుల్లో శిక్షణ పొందాలంటే ఏడవ తరగతి విద్యార్హత కలిగివుండాలని, మిగిలిన విభాగాలకు 10వ తరగతి విద్యార్హత అని పేర్కొన్నారు. వివరాలకు 0861-238355, లేదా 9494133370 నంబర్లకు సంప్రదించాలని, గ్రామీణ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

### పురిటిబిడ్డకు...

# ప్రాణదానం చేసిన రిచ్ వైద్యులు



నెలలు నిండకుండా అతితక్కువ బరువుతో జన్మించిన పురిటిబిడ్డకు నెల్లూరు పొగతోటలోని రిచ్ ఆసుపత్రి వైద్యులు హైఫ్రీక్వెన్సీ ఆసిలేటర్ పరికరం ద్వారా చికిత్స అందించి బ్రతికించారు. ఈమేరకు రిచ్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఛైర్మెన్ డా॥ టి.రవికుమార్ ఈ నెల 1వ తేదీన తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నెల్లూరుజిల్లా పొదలకూరు గ్రామానికి చెందిన హర్షిత, రాజశేఖర్ దంపతులకు మేనెల 30వ తేదీన నెలలు నిండకుండానే అతితక్కువ బరువుతో కేవలం 1.4కేజీలతో మగబిడ్డ జన్మించగా, ఆ పసికందును బతికించుకోవడానికి తల్లిదండ్రులు ఆ బిడ్డను కడపకు తీసుకుపోగా అక్కడి వైద్యులు బిడ్డ బతకడం కష్టమని, చెన్నైకు తీసుకెళ్ళమని చెప్పగా, ఆ బిడ్డ తల్లిదండ్రులు నెల్లూరులోని రిచ్ ఆసుపత్రికి తీసుకురావడం జరిగిందన్నారు. అప్పటికే శ్వాసకోశ సమస్యలతో, ఊపిరితిత్తులు అభివృద్ధి చెందకుండా ప్రాణాపాయ స్థితిలో వున్న బిడ్డకు సాధారణ వెంటిలేటర్స్ సహకరించకపోవడంతో హైఫ్రీక్వెన్సీ ఆసిలేటర్‌తో వైద్యచికిత్స అందించడంతో ప్రాణాపాయం నుండి బయట పడడం జరిగిందన్నారు. మహానగరాల్లో మాత్రమే వుండే ఈ అత్యాధునిక వైద్యపరికరం రిచ్ హాస్పిటల్‌లో ఉండటంతో ఎంతోమంది పిల్లల ప్రాణాలు కాపాడగలుగుతున్నామన్నారు. చుట్టుపక్కల ఏ జిల్లాలో లేని హైఫ్రీక్వెన్సీ ఆసిలేటర్ పరికరం సాధారణ వెంటిలేటర్ కన్నా వెయ్యిరెట్లు బాగా పనిచేయడంతో, ఊపిరితిత్తులు అభివృద్ధి చేయడానికి బిడ్డకు ప్రాణవాయువును అందించడానికి ఎంతో సులువుగా ఉందని రవికుమార్ పేర్కొన్నారు. డా॥ ఎన్టీఆర్ వైద్యసేవా పథకం ద్వారా పూర్తి ఉచితంగా వైద్యసేవలు అందించిన డా॥ రవికుమార్‌కు బిడ్డ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## జీతాలు రాక పిహెచ్‌సి సిబ్బంది అవస్థలు

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి వెంటనే జీతాలు ఇప్పించాలని కోరుతూ ఏపి అర్బన్ హెల్త్ సెంటర్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తిరుపతయ్య, కార్యదర్శి ఉదయగిరి వేణుగోపాల్ సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వరసుందరానికి వినతిపత్రం సమర్పించారు. గత పదినెలలుగా జీతాలు లేక తామెన్నో అవస్థలకు గురవుతున్నామని, తమ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు డిఎంఅండ్‌హెచ్‌ఓ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. తమ విన్నపాన్ని పరిశీలించి వెంటనే తమకు జీతాలు ఇప్పించాల్సిందిగా వారు ఆయనను కోరారు.

# జనం మెచ్చేలా జగన్!

(మొదటి పేజీ తరువాయి)

జగన్ ఎంతో ఓర్పుతో, నేర్పుతో చల్లార్చిన తీరు రాజకీయ విమర్శకుల నుండి సైతం ప్రశంసలు అందుకొంది.

పశ్చిమ గోదావరి జిల్లా గరగపర్రు గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించే విషయంలో దళితులకు, అగ్రవర్ణాల వారికి మధ్య వివాదం రాజుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా దళిత సంఘాలు ఈ వివాదంలో తల దూర్చాయి. నానాటికీ సమస్య తీవ్రమవుతున్నా, గతంలో జరిగిన కారంచేడు, చుండూరు వంటి సంఘటనలు కళ్ళముందు కదలాడుతున్నా ప్రభుత్వం ఆ వివాదాన్ని చల్లార్చే ప్రయత్నం చేయలేదు. ఆ వివాదంలో దిగి ఒకరి పక్కన మాట్లాడితే ఇంకొకరి ఓట్లు పోతాయనే భయంతో అధికారపార్టీ కిమ్మనకుండా ఉండిపోయింది.

కాని ప్రతిపక్ష నేతగా జగన్ సైలెంట్ కాలేదు. ఈ వివాదంలో తలదూరిస్తే కొందరు దూరమవుతారని పార్టీ నాయకులు సలహా ఇచ్చినా జగన్ వినిపించుకోలేదు. గరగపర్రు వెళ్లాడు. దళితులతో కలిసి నేలపైనే కూర్చున్నాడు. వారు పెట్టింది తిన్నాడు. వారు చెప్పింది విన్నాడు. వారిలో అగ్రవర్ణాల వారిపై తిరగబడండంటూ విద్వేషం నూరిపోయలేదు. ఊరన్నాక అందరూ కలిసిమెలిసి వుండాలని చెప్పి, వారిలో వున్న ఆవేశాన్ని తగ్గించాడు. అలాగే ఆ గ్రామంలోని అగ్రవర్ణాల వారితోనూ ఆయన మాట్లాడాడు. దళితులను మీ వాళ్ళుగా చూడాలని, అంబేద్కర్ అందరివాడని, జాతీయ నాయకుడని చెప్పారు. ఇలా ఇరువర్గాల వారిని శాంతింపజేసి సమన్వయ పరచి, ప్రభుత్వం చేయలేని పనిని ప్రతిపక్ష నేతగా తాను చేసి చూపించాడు. ఈ మొత్తం వ్యవహారంలో ఆయన ఎక్కడా రాజకీయాలు మాట్లాడలేదు. ప్రభుత్వంపై విమర్శలు చేయలేదు. అదే ఈ పొజిషన్‌లో చంద్రబాబు ఉండుంటే అరగంట తన గురించి చెప్పుకుని, అరగంట ప్రతిపక్షాన్ని తిట్టి అరనిముషం సమస్య గురించి మాట్లాడి వుండేవాడు.

గరగపర్రు వివాదంలో జగన్ వ్యవహరించిన తీరుపై ఆయన ప్రత్యర్థి పార్టీల నేతలు కూడా మెచ్చుకుంటున్నారు. శెభాష్ జగన్ అని అభినందిస్తున్నారు.

# ఓట్లకు నోట్ల వర్షమే?

(మొదటి పేజీ తరువాయి)

ధారపోసిన వాళ్ళు, రేపు సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రాక్టీస్ మ్యాచ్ లాంటి నంద్యాల ఎన్నికలో ఊరుకుంటారా? అదీగాక అధికారపార్టీ వాళ్ళు... ఈ మూడేళ్లలో బాగానే పోగేసారు. నంద్యాల మీద ఎంత పెట్టినా ఏం పోతుంది. తెలుగుదేశం ఇప్పటికే ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టింది. అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి ఇంటింటి ప్రచారంలో వుండగా, మరో పక్క మున్సిపల్ మంత్రి నారాయణ రంగంలోకి దిగి వున్నాడు. ఆయన వున్నాడంటే డబ్బుకు లోటులేదనే! నంద్యాలపై తెలుగుదేశం వాళ్ళు వరాల జల్లులు కురిపిస్తున్నారు. అవతల చూస్తే వైకాపా అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి తక్కువ వాడేం కాదు. నియోజకవర్గంలో పేరున్నోడు. ఆర్థికంగానూ మోటుకునే వాడు. కాబట్టి పోరు రసవత్తరమే! ఎన్నికల కమిషన్ బయట రాష్ట్రాల నుండి బలగాలను తెప్పించి బందోబస్తు పెడితే తప్ప లేకుంటే ఓట్ల కోసం కురిసే నోట్ల వర్షాన్ని ఆపలేరు.

# అడ్డం తిరిగిన సదావర్తి

(మొదటి పేజీ తరువాయి)

ఆళ్ల రామకృష్ణారెడ్డి స్పందించారు. దీనిపై హైకోర్టు కెక్కారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్లు సదావర్తి భూములకు అదనంగా 5కోట్లు చెల్లించేందుకు తాము సిద్ధంగా వున్నామని హైకోర్టుకు తెలిపారు. ఈ నెల 3వ తేదీన ఆళ్ల పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం వేలంపాట మొత్తం 22.44కోట్లకు మరో 5కోట్లను జత చేసి 27.44 కోట్లను నాలుగు వారాల్లోగా చెల్లించి భూములను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది. రెండు వారాల్లోగా పది కోట్లు జమ చేయాలని ఆదేశించింది. ఒకవేళ అలా నిర్ణీత గడువులోగా చెప్పిన డబ్బు జమ చేయకపోతే పిటీషనర్‌కు కోటి రూపాయల జరిమానా విధించే అవకాశం కూడా వున్నట్లు తెలుస్తోంది.

సదావర్తి భూములపై ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పుతో ప్రభుత్వ పెద్దలకు దిమ్మ తిరిగినట్లయ్యింది. గుంటూరు జిల్లా అమరావతిలోని అమర లింగేశ్వరస్వామి వారి సదావర్తి సత్రానికి చెందిన ఈ 83.11 ఎకరాల భూములు ఆక్రమణలో ఉన్నాయని చెప్పి గతేడాది మార్చిలో వేలం పాటల ద్వారా అనుయాయులకు కట్టబెట్టారు. మార్కెట్ రేటు ప్రకారం అక్కడ ఎకరా 6కోట్లు దాకా పలుకుతోందని. కాని ప్రభుత్వం ఎకరా ధరను 50లక్షలుగా మాత్రమే నిర్ణయించింది. అయితే ప్రభుత్వ పెద్దల స్కెచ్‌తో కొందరు కుమ్మక్కై ఆ భూములకు అంత రేటు పెట్టకుండా ఎకరా ధరను 27లక్షల నూటఎనభై ఎనిమిది రూపాయలుగా నిర్ణయించారు. ఇలా మొత్తం 83.11 ఎకరాలను 22కోట్ల 44లక్షల 12వేల 625 రూపాయలకు కొంతమంది వ్యక్తులు అధికారపార్టీ వారి అండతో దక్కించుకున్నారు. అయితే దీనిపై ప్రతిపక్ష వైకాపా స్పందించింది. వందల కోట్లు విలువ చేసే భూములను నామమాత్రం ధరకే కట్టబెట్టారంటూ పోరాటానికి దిగింది. ముఖ్యంగా మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అయితే పట్టు విడవకుండా పోరాడాడు. చివరకు న్యాయపోరాటం ద్వారా తెలుగుదేశం పెద్దలకు చుక్కలు చూపించాడు. రేపు రామకృష్ణారెడ్డి తాను కాని, తన మనుషుల ద్వారా కాని అదనంగా 5కోట్లు చెల్లించి సదావర్తి భూములను విడిపిస్తే తెలుగుదేశం నాయకులు చేతిలో పడ్డ బంగారు బంతి జారిపోయినట్లుగా ఫీల్ కావడం ఖాయం.



ఆయన తెలుగుదేశం నాయకుడు... అంతకుముందు ఆయన కాంగ్రెస్సే... కాకపోతే రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ గల్లంతు కావడంతో ఆయన ఆ పార్టీలో ఉండలేక అధికార తెలుగుదేశంలో చేరిపోయారు. అయితే ఆయన తెలుగుదేశంలో చేరాడన్న మాటేగాని తెలుగుదేశం నాయకులు ఆయనను తమ పార్టీవాడిగా చూస్తున్నట్లు లేదు. వీళ్లు పట్టించుకోకుండా పోవడానికి ఆయన వార్డు స్థాయి నాయకుడో, మండలస్థాయి నాయకుడో కాదు, జిల్లా స్థాయి పదవిలో వున్న నాయకుడు. జిల్లాలోని ప్రతి మండలంతో, ప్రతి గ్రామంలోని రైతుతో సంబంధాలు కలిగివున్న నాయకుడు. ఆయనే జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి.

# సమర్థతకు గుర్తింపేది?

- **తన పనితీరుతో పార్టీకి పేరుతెస్తున్న మెట్టుకూరు ధనుంజయరెడ్డి**
- **అయినా మారని 'దేశం' నేతల తీరు**

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆనం రామనారాయణరెడ్డి ముఖ్యఅనుచరుడిగా రాజకీయాల్లోకి వచ్చారు. 2013లో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్‌గా ఎన్నికయ్యారు. 2014 ఎన్నికల తర్వాత ఆనంను కాదనుకుని తెలుగుదేశంలో చేరారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్‌గా ఎటువంటి అవినీతి ఆరోపణలకు ఆస్కారం లేకుండా సమర్ధవంతమైన పాలనను అందిస్తున్నారు. బ్యాంకులో సంస్కరణలు చేపట్టారు. బ్యాంకును ఆధునీకరణ పట్టాలెక్కించారు. జిల్లా వ్యాప్తంగా కొత్తబ్రాంచ్‌లతో పాటు రైతులకు సౌకర్యాలు పెంచారు. బ్యాంకు ద్వారా రైతులకు అందించే సేవలను మెరుగుపరిచారు. మెట్టుకూరు ధనుంజయరెడ్డి బ్యాంకు ఛైర్మెన్‌గా పనిచేస్తున్నా అనధికారికంగా తెలుగుదేశం నాయకుడిగా, ఆ పార్టీ పటిష్టత కోసం పనిచేస్తున్నట్లే లెక్క. ఒక ఎంపీ ఏడు అసెంబ్లీల పరిధిలో మాత్రమే పని చేయగలడు. ఒక ఎమ్మెల్యే ఒక అసెంబ్లీ నియోజకవర్గానికే పరిమితం. కాని, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ జిల్లాలోని 10అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని రైతులపై ప్రభావం చూపగలడు. అంతే కాదు, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీకి అవసరమైన నాయకుడు కూడా! ఇటు సొంత నియోజకవర్గం ఆత్మకూరుతో పాటు పక్క నియోజకవర్గమైన వెంకటగిరిలో కూడా బలం, బంధుత్వం వుంది. ఆర్థికంగానూ ప్రత్యర్థిని ఢీకొట్టే సత్తావున్న నాయకుడు. రేపటి అసెంబ్లీ ఎన్నికల్లోనూ చంద్రబాబు వాడుకోదగ్గ ఆయుధం ధనుంజయరెడ్డి.

అధికారికంగానూ, రాజకీయంగానూ ఇంత ప్రాధాన్యతగల పదవిలో వున్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్‌కు తెలుగుదేశంపార్టీలోనే సరైన ప్రాధాన్యత లభించడం లేదని తెలుస్తోంది. ఇటీవల జరిగిన 'నుడా' ఛైర్మెన్ ప్రమాణస్వీకారోత్సవంతో పాటు మినీ మహానాడు కార్యక్రమంలోగాని, పార్టీ పరంగా నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలప్పుడు గాని ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీకటౌట్‌లలో, వాల్‌పోస్టర్‌లలో, పత్రికా ప్రకటనలలో ఆయన ఫోటోను ఎక్కడా వేయడం లేదు. చిన్న చిన్న పదవులున్న నాయకులకు, మాజీలకు ఇస్తున్న ప్రాధాన్యతను కూడా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ హోదాకు ఇస్తున్నట్లుగా లేదు. దీనినిబట్టి చూస్తే తెలుగుదేశం వాళ్ళు ఆయనను తమ పార్టీ నాయకుడిగా కాక, ఇంకా కాంగ్రెస్ నాయకుడిగానే పరిగణిస్తున్నారేమోననే అనుమానాలొస్తున్నాయి.

# మద్యంపై మరో దండయాత్ర

- **జిల్లా వ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలు**
- **జనావాసాల మధ్య వైన్‌షాపులపై ఆందోళనలు**



కొత్త ఎక్సైజ్ పాలసీ పుణ్యమా అని మద్యంపై మరోసారి మహిళలు రోడ్డెకాల్సి వచ్చింది. మద్యం షాపులకు వ్యతిరేకంగా పోరాడాల్సి వచ్చింది. వీధుల్లో మద్యం షాపులు వద్దంటూ మహిళలు చేస్తున్న పోరాటాలు చూస్తుంటే... 1992 నాటి సారా వ్యతిరేకోద్యమం గుర్తుకువస్తోంది. జాతీయ, రాష్ట్ర రహదారుల పక్కన మద్యం షాపులను సుప్రీం కోర్టు నిషేధించడంతో ఈ షాపులన్నీంటిని కూడా యజమానులు జనావాస ప్రాంతాల్లో పెట్టే ప్రయత్నం చేశారు. అయితే తమ ఇళ్ళ మధ్య మద్యం షాపులేంటంటూ స్థానికులు, ముఖ్యంగా మహిళలు తిరగబడ్డారు. పలు ప్రాంతాల్లో మద్యం వ్యాపారులకు, మహిళలకు మధ్య ఘర్షణలు కూడా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని మండలాల్లో ఇలాంటి పరిస్థితులే ఎదురయ్యాయి.

జనావాసాలు, విద్యాసంస్థలు ఉండే తమ ప్రాంతాల్లో మద్యం దుకాణం వద్దనేవద్దంటూ మహిళలు పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. వీరికి మద్దతుగా నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆందోళనలో పాల్గొని మద్యం దుకాణం వద్ద బైఠాయించారు. మద్యం దుకాణం తక్షణమే తొలగించాలని లేని పక్షంలో ఆందోళన సాగిస్తామని హెచ్చరించారు. దాదాపు నాలుగు గంటల పాటు జరిగిన ఈ ఆందోళనతో మూడు రోజుల్లో దుకాణం తొలగిస్తానని మద్యం దుకాణం యజమాని హామీ ఇవ్వడంతో ఎమ్మెల్యే, స్థానికులు శాంతించారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో జాతీయ రహదారికి 500మీటర్ల అవతల మద్యం దుకాణం ఏర్పాటు చేసుకోవాల్సి రావడంతో అయ్యప్ప గుడి సమీపంలో మద్యం దుకాణాన్ని రెండురోజుల క్రితం తల్పగిరి కాలనీలో ఇళ్ల మధ్య ఏర్పాటు చేశారు. నెల్లూరు నగరంలో ఎక్కడా మద్యం దుకాణాలు లేకపోవడంతో మద్యంప్రియులు పెద్ద ఎత్తున ఈ ప్రాంతానికి చేరుకుని మందు కొనుగోలు చేయడం ప్రారంభించారు. దీంతో స్థానికుల్లో ఆందోళన మొదలైంది. ఈ విషయాన్ని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మంగళవారం సాయంత్రం పెద్దఎత్తున మహిళలు, స్థానికులు కలిసి మద్యం దుకాణం వద్ద ఆందోళన చేపట్టారు. నర్సింగ్ కళాశాల, జనావాసాలు ఉండే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం ఏంటంటూ నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించి దుకాణం ముందు బైఠాయించారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ చర్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారని, సుప్రీంకోర్టు నిబంధనలు అనుసరించి దూరప్రాంతాల్లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోమంటే వాటిని జనావాసాల మధ్య ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు. మద్యం దుకాణాల కోసం ఆటోనగర్ మాదిరిగా మద్యంనగర్ అని ఒక కాలనీ ఏర్పాటు చేసి దుకాణాలన్నీ అక్కడకు తరలించాలని డిమాండ్ చేశారు. మహిళలు, విద్యార్థినులు ఉన్న ప్రాంతంలో దుకాణం ఏర్పాటు చేస్తే వారికి రక్షణ కరువవుతుందని, దీనికి అధికారులు కూడా బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఈ ఆందోళనతో దుకాణం యజమాని వెంకటేష్ అక్కడకు చేరుకుని చర్చలు జరిపారు. తాను లక్షలు వెచ్చించి అన్ని అనుమతులతో దుకాణం ఏర్పాటు చేసుకున్నానని, ఒక్కరోజుకే మూసేస్తే తీవ్రంగా నష్టపోతానని తెలిపారు. మానవతా దృక్ఫథంతో తనకు మూడురోజులు అవకాశం ఇస్తే ఉన్న సరుకుని విక్రయించేసి దుకాణాన్ని తొలగిస్తానని ఎమ్మెల్యేకు, ప్రజలకు హామీ ఇవ్వడంతో స్థానికులు ఆందోళన విరమించారు. ఆందోళనలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అయిదవ నగర సిఐ మంగారావు, ఎస్సై విజయ్‌కుమార్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. దిలీప్ నర్సింగ్ స్కూల్ కరస్పాండెంట్ ప్రభుదాస్, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్, టిడిపి, లోక్‌సత్తా, కాంగ్రెస్, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

# విదేశాల్లో నెల్లూరు నేతలు

## సింగపూర్‌లో సోమిరెడ్డి




రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈనెల 5వతేదీన సింగపూర్‌కు బయల్దేరి వెళ్లారు. ఆరోజు ఉదయం 11.30గంటలకు చెన్నై ఎయిర్‌పోర్టులో విమానమెక్కి సింగపూర్‌లో దిగారు. 6, 7తేదీలలో సింగపూర్‌లోని రాజారత్నం స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్టడీస్, నాన్‌వాంగ్ టెక్నాలికల్ యూనివర్శిటీలో జరిగిన ప్రపంచ వ్యవసాయ సదస్సులో పాల్గొన్నారు. 8వ తేదీ మధ్యాహ్నం సింగపూర్ నుండి బయలుదేరి ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాకు చేరుకుంటారు. అక్కడ 8, 9, 10తేదీలలో అంతర్జాతీయ వరి పరిశోధనా కేంద్రాలను సందర్శిస్తారు. ఆధునిక వ్యవసాయ విధానాలను పరిశీలించనున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమావేశమై కొత్త వంగడాల సృష్టిపై చర్చిస్తారు. అలాగే పలు వ్యవసాయ క్షేత్రాలను కూడా ఆయన సందర్శిస్తారు. 10వ తేదీ మనీలా నుండి బయలుదేరి తిరిగి సింగపూర్‌కు చేరుకుంటారు. 11వ తేదీ ఉదయం సింగపూర్ నుండి బయలుదేరి చెన్నైలో దిగుతారు.



## చైనాకు నారాయణ

రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ 5వ తేదీ తన సిఆర్‌డిఏ బృందంతో కలిసి చైనాకు వెళ్లారు. విజయవాడలో మెట్రో నిర్మాణానికి పలు అవాంతరాలు ఎదురవుతున్నాయి. పెట్టుబడి భారీగాను రాబడి తక్కువగాను ఉండే అవకాశముంది. చైనాలో రోడ్డుపై రైలు మాదిరిగా వుండే బస్సులు తిరుగుతున్నాయి. ఇలాంటి వాటిని విజయవాడ – గుంటూరు – అమరావతిల మధ్య కూడా తిప్పడానికి వీలవుతుందో లేదో అని చూసేదానికి ఆయన చైనా వెళ్లారు.

## లండన్‌కు అజీజ్



సోమిరెడ్డి సింగపూర్‌కు, నారాయణ చైనాకు వెళ్ళగా నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్ 5వ తేదీ లండన్‌కు బయలుదేరి వెళ్లాడు. అయితే మంత్రులిద్దరూ అధికారిక పర్యటనలకు విదేశాలకు వెళ్లగా, అజీజ్ మాత్రం లండన్‌లో రొయ్యల సంబంధిత తన వ్యాపార సంస్థ ప్రారంభోత్సవానికి వెళ్లాడు.

### రాష్ట్రపతి ఎన్నికల ప్రచారంలో

# ప్రత్యేక ఆకర్షణగా అనిల్



రాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో ఎన్డీఏ ప్రతిపాదించిన అభ్యర్థి రామ్‌నాద్ కోవింద్‌కు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలపడం తెలిసిందే! వివిధ పార్టీల మద్దతు కోరేందుకు హైదరాబాద్ వచ్చిన రామ్‌నాథ్ కోవింద్ 4వతేదీ పార్క్ హయత్ హోటల్‌లో వైకాపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమయ్యారు. తన పార్టీ సభ్యులను జగన్ ఒక్కొక్కరిగా రామ్‌నాథ్ కోవింద్‌కు పరిచయం చేసారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ను పరిచయం చేస్తున్న సమయంలో రామ్‌నాథ్ కోవింద్ అనిల్ గురించి ఆసక్తిగా అడిగారు. చిన్నవయసులోనే ఎమ్మెల్యే అయ్యాడా అని ఆయన అడగ్గా యంగ్‌ఎమ్మెల్యేనే కాదు, డేరింగ్... డాషింగ్... డైనమిక్ ఎమ్మెల్యే కూడా... డాక్టర్ చదివి రాజకీయాల్లోకి వచ్చాడని జగన్ ప్రత్యేకంగా చెప్పారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com